ఈనాడు పశ్చిమగోదావరి

సోమవారం అక్టోబరు 14, 2024 5

శేషాచలానికి తిరుకల్యాణోత్సవ శోభ!



స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శ్రీవారి నిత్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై సర్వాభరణ భూషితులైన శ్రీనివాసుడు పెండ్లికుమారుడిగా, శ్రీదేవి భూదేవి అమ్మవార్లు పెండ్లికుమార్తెలుగా ఉత్సవ మూర్తులను ముస్తాబు చేశారు. అనంతరం వేద పండితులు, అర్చకులు నూతన వస్త్రాలు సమర్పించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారు శ్రీమహావిష్ణు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణం వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ★ కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ, రాత్రి 9 గంటలకు హంస వాహనంపై గ్రామోత్సవం ఉంటుంది.

పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా స్వామి, అమ్మవార్ల ముస్తాబు



గజ వాహనంపై..

నేత్ర పర్వం చిన వేంకన్న గ్రామోత్సవం..

విజయ దశమి రోజున వేంకటేశ్వర స్వామి అమ్మవార్లను రాజాధిరాజ వాహనంపై ఉంచి గ్రామోత్సవం చేశారు. తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గజ వాహనంపై చిన్న వేంకన్న గ్రామోత్సవం నిర్వహించారు.

నేటి నుంచి పల్లె పండగ

- ఉమ్మడి జిల్లాలో వారం రోజుల పాటు నిర్వహణ
- ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో భూమి పూజలు



ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: పల్లెల్లో నేటి నుంచి అసలైన పండగ ప్రారంభం కానుంది. వైకాపా ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో గ్రామాభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక, గత లోపాలు సరిదిద్దుతోంది. పల్లె ప్రగతికి మంచి దారులు వేస్తోంది. తాజాగా 'పల్లె పండగ' పేరిట సోమవారం నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో మురుగు కాలువలు, సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 937 పంచాయతీల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆమోదం పొందిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ వారోత్సవాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కానున్నారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలిలా..		
జిల్లా	పనులు	నిధులు (రూ.కోట్లలో)
ఏలూరు	1,862	137.27
పశ్చిమ	423	51.03

గ్రామాల్లో బోర్డుల ఏర్పాటు.. ప్రతి పంచాయతీలో ఈ ఏడాది చేసే అభివృద్ధి పనులకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేయాలి. పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాల నిర్వహణకు సంబంధించి దండోరా వేయించాలి. భూమి పూజలకు సంబంధించి పంచాయతీల్లో ముందస్తుగా ప్రచారం కల్పించాలి. అభివృద్ధి పనులు, భూమి పూజల వివరాలు ప్రజాప్రతినిధులకు ముందుగానే తెలియజేయాలి. ఎక్కడెక్కడ ఏయే పనులు ప్రారంభించి, ఎప్పటికి పూర్తి చేస్తారన్న పూర్తి వివరాలు గ్రామ సభలో ప్రజలకు వివరించేలా బోర్డులుండాలని ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. భూమి పూజలకు గ్రామ పంచాయతీలు, తేదీల వారీగా రోడ్ మ్యాప్ షెడ్యూల్ అమలు చేయడం, మంజూరైన పనులను పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఎప్పటికప్పుడు పీఆర్ వన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

లంకల గుండె కోత

- నదీ గర్భంలో కలిసిపోతున్న వైనం
- నష్టపోతున్న రైతులు



కనకాయలంకలో కోతకు గురైన లంక భూములు

భీమవరం టూటౌన్, ఆచంట, న్యూస్‌టుడే: గోదావరి నదికి వరద వచ్చి వెళ్లిందంటే ఎకరాల కొద్దీ విలువైన పంట భూములు నదీ గర్భంలో కలిసిపోవడం పరిపాటిగా మారింది. నీటి ప్రవాహ వడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో భూములు కోత బారిన పడుతున్నాయి. ఫలితంగా లంక గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లా పరిధిలో పెనుగొండ మండలం దొంగరావిపాలెం నుంచి నరసాపురం వరకు తీరాన్ని ఆనుకుని వేల ఎకరాల లంక భూములు ఉన్నాయి. ఈ భూముల్లో ఏడాది పొడవునా ఆదాయాన్ని ఇచ్చే కొబ్బరితోటలతో పాటు తమలపాకు, మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగవుతున్నాయి. ముఖ్యంగా పెనుగొండ, ఆచంట, యలమంచిలి మండలాల్లో నదీ తీరాన్ని ఆనుకుని సుమారు 3వేల ఎకరాల మేర లంక భూములు ఉన్నాయి. ఇప్పటికే కోత బారిన పడి సుమారు 500 ఎకరాల వరకు గోదావరి వడిలో కలిసిపోయాయి. గడిచిన పదేళ్లలో పలు మధ్యస్థ లంకలు సైతం కనుమరుగయ్యాయి.

కొంప ముంచుతున్న అక్రమ తవ్వకాలు.. లంక గ్రామాల్లోని నదీ తీరంలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న అక్రమ తవ్వకాల కారణంగా కూడా విలువైన భూములు కోత బారిన పడుతున్నాయని లంక రైతులు వాపోతున్నారు. ఆచంట మండలంలోని పెదమల్లంలంక, పుచ్చల్లంక, అయోధ్య లంక గ్రామాల్లో నదికి ఆనుకుని ఉన్న లంక భూముల్లో మీటర్ల కొద్దీ లోతుగా తవ్వకాలు నిర్వహించి మట్టిని తరలిస్తున్నారు. దీంతో వరద ఉద్ధృతికి సమీప భూములు కోతకు గురవుతున్నాయి. పెనుగొండ మండలం సిద్ధాంతం, నడిపూడి, ఆచంట మండలం కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఇసుక తవ్వకాలతో కూడా సమీప భూములు గోదావరిలో కలిసిపోతున్నాయి.

అటకెక్కిన గ్రోయిన్ల నిర్మాణం

నదీ తీరం వెంబడి లంక భూములు కోతకు గురికాకుండా ఉండేందుకు గ్రోయిన్ల నిర్మాణాలు జరిగేవి. దీనిలో భాగంగా 2006లో పెనుగొండ మండలం దొంగరావిపాలెం వద్ద 600 మీటర్ల మేర రూ.20 కోట్లతో గ్రోయిన్ నిర్మాణం చేపట్టగా నాణ్యతలోపంతో అనతికాలంలోనే కుప్పకూలింది. మళ్లీ అదే ప్రాంతంలో రూ.16.60 కోట్లతో 175 మీటర్ల మేర కొత్తగా నిర్మించేందుకు రెండేళ్ల కిందట ప్రతిపాదనలు చేశారు. పెదమల్లం, అయోధ్యలంక పరిధిలో పలుచోట్ల వీటి ఏర్పాటుకు పరిశీలించగా.. నిధులు మంజూరు కాక అవన్నీ ప్రతిపాదనలుగా మిగిలిపోయాయి.

సర్దుతూ.. సరిదిద్దుతూ!

- ప్రక్షాళన దిశగా ప్రజాపంపిణీ వ్యవస్థ
- చౌకదుకాణాల పెంపునకు కసరత్తు



యలమంచిలి మండలం కనకాయలంకలో 950 వరకు బియ్యం కార్డులున్నాయి. ఇవన్నీ ఒకే చౌక దుకాణంలో ఉండటంతో వరదల సమయంలో ఇక్కడ నిత్యావసరాలు పంపిణీ చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే మండలంలోని బాడవలోను ఇదే పరిస్థితి. ఇటువంటి గ్రామాల్లో రెండో చౌక దుకాణం ఏర్పాటు చేసి సమస్యను అధిగమించడంతోపాటు మరొకరికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం భావిస్తుంది.

400 కార్డులకో దుకాణం.. జిల్లాలో చాలా చోట్ల చౌక దుకాణాల్లో 800 నుంచి 900కు పైబడి బియ్యం కార్డులున్నాయి. కొన్ని దుకాణాల్లో రెండుమూడొందల కార్డులే ఉన్నాయి. దీనివల్ల ఎక్కువ కార్డులున్న డీలర్లకు కమీషన్ ఎక్కువ రావడం తక్కువ ఉన్నవాళ్లకు తక్కువగా వస్తుండటం జరుగుతోంది. ఆయా వ్యత్యాసాలను సరిచేయడంతోపాటు పంపిణీని సులభతరం చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంది. దీనికి తగ్గట్టుగా అన్ని మండలాల్లోనూ 800 కార్డులు దాటి ఉన్న చౌక దుకాణాలను రెండుగా విభజించడానికి రంగం సిద్ధమయ్యింది. రెండో దుకాణం ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 120 దుకాణాల వరకు కొత్తవి రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

పాలకొల్లు, న్యూస్‌టుడే

... గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చేసింది. అవసరం లేకపోయినా ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టి కేవలం బియ్యం పంపిణీ చేసి చేతులు దులిపేసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజాపంపిణీ వ్యవస్థపై దృష్టిసారించింది. నిత్యావసరాలు కొండెక్కి కూర్చున్న తరుణంలో వీలైనన్ని ఎక్కువ సరకులు చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించి ఇప్పటికే పంచదార, కందిపప్పు పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇతర సమస్యలను అధిగమించడానికి తీవ్ర కసరత్తు చేస్తుంది.

ఉభయ జిల్లాల్లో వివరాలిలా..			
జిల్లా	మొత్తం కార్డులు	చౌక దుకాణాలు	ఎండీయూ వాహనాలు
ఏలూరు	6,31,044	1,052	358
పశ్చిమ	5,67,651	1,135	343

కొత్తకార్డులు సైతం.. గత వైకాపా ప్రభుత్వం ఆరంచెల తనిఖీల్లో చాలా మంది లబ్ధిదారులు బియ్యం కార్డులు కోల్పోయారు. వీరందరిని ఆదుకోవడానికి త్వరలో కొత్త బియ్యం కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కార్డులో సభ్యుల మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించిన ప్రభుత్వం కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేసి కార్డులను సర్దుతూ గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దడానికి సమాయత్తమయ్యింది. దీనిపై పశ్చిమలోని పౌరసరఫరాల సంస్థ సహాయ అధికారి రవిశంకర్‌ను సంప్రదించగా జిల్లాలో కొత్తగా 60 చౌక దుకాణాల వరకు పెరుగుతాయని చెప్పారు.

నిండా అవరోధాలు



యండగండి సమీపాన పంటకాలువలోకి ఒరిగిన చెట్టు



వెంప-వారతిప్ప రోడ్డులో పూడి పోయిన పంట కాలువ

పశ్చిమగోదావరి జిల్లాలో పలు పంట కాలువలు వ్యర్థాలతో పూడిపోయి సాగునీటి పారుదలకు అవరోధాలు ఏర్పడుతున్నాయి. దీంతో శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా ఏలుబడిలో నిర్వహణ పనులు చేపట్టకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. ఉండి మండలం యండగండి సమీపాన పంట కాలువలోకి ఓ చెట్టు ఒరిగిపోయి ప్రవాహానికి అడ్డంగా ఉంది. నరసాపురం మండలంలో పలు ప్రాంతాల్లో పంటకాలువపై పాదులు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోయాయి.

- ఈనాడు, భీమవరం

దోబూచులాడుతున్న గోదారమ్మ

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరి వరద దోబూచులాడుతోంది. కొన్ని రోజులుగా ఉదయం పెరిగి సాయంత్రానికి తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద ఆదివారం ఉదయం 26.97 మీటర్లు ఉన్న నీటి మట్టం సాయంత్రానికి 26.96కి తగ్గింది. 48 గేట్ల ద్వారా 88.73 వేల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నట్లు జలవనరులశాఖ అధికారులు చెప్పారు.

ఆకివీడులో 29 మి.మీ. వర్షం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు 9.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఆకివీడు మండలంలో 29 మి.మీ. వర్షం కురిసింది. అత్తిలి 28.8, ఇరగవరం 22.4, పెనుగొండ 16.8, తణుకు 14.2, పెనుమంట్ర 12.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

చేపల వేటకు వెళ్లొద్దు

నరసాపురం, న్యూస్‌టుడే: సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని ఆర్డీవో దాసి రాజు మత్స్యకారులకు సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్ర అలలు ప్రమాదకరంగా ఉంటాయని, తదుపరి ప్రకటన వెలువడే వరకూ చేపల వేటకు వెళ్లొద్దని తెలిపారు.

టెట్‌కు 64 మంది గైర్హాజరు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం కేంద్రాల్లో ఆదివారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 64 మంది గైర్హాజరైనట్లు డీఈవో జి.నాగమణి తెలిపారు. భీమవరం డీఎన్నార్ కళాశాల కేంద్రంలో 25, తాడేపల్లిగూడెం వాసవీ కళాశాల కేంద్రంలో 39 మంది గైర్హాజరయ్యారు.

కీలక దశలో మరో గండం!

వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతల్లో కలవరం

ఉండి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈ నెల 14, 15, 16 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణశాఖ హెచ్చరికలు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. మెట్ట మండలాల్లో ముందుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో వరి కోతలు ఇప్పటికే ప్రారంభంకాగా మరో పది రోజుల్లో ఊపందుకునే అవకాశాలున్నాయి. డెల్టాలో అధికశాతం చేలు చిరుపొట్ట నుంచి పూత దశలో ఉన్నాయి. ఈ దశలో భారీ వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం తప్పదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జాగ్రత్తలు పాటించండి.. చేలు పూత దశలో ఉన్నప్పుడు వర్షాలు కురిస్తే తాలు గింజల శాతం పెరిగే ప్రమాదముందని మార్టేరు వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త కృష్ణాజీ తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత ప్రొపికొనజోల్ ఒక ఎంఎల్ మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. చేలకు సమీపాన మురుగు బోదెల్లో నీటి పారుదలకు అవరోధాలు లేకుండా చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు సూచించారు.



ఉండి కేవీకే ప్రాంగణంలో గింజ గట్టిపడే దశలో ఉన్న విత్తన చేలు

ఇప్పటికే రెండుసార్లు నష్టం..!.. జులైలో కురిసిన అధిక వర్షాలకు పశ్చిమ డెల్టాలో నారుమడి దశలో 30 వేల ఎకరాలకు సరిపడే నారుమడులు, 15 వేల ఎకరాల్లో నాట్లు దెబ్బతిన్నాయి. అప్పట్లో 80 శాతం రాయితీపై 3,500 క్వింటాళ్ల వరి విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఆగస్టు, సెప్టెంబరుల్లో కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావంతో 8,798 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారికంగా గుర్తించారు. దీనికి సంబంధించి 6,312 మంది రైతులకు రూ.8.90 కోట్ల పెట్టుబడి రాయితీని ప్రభుత్వం అందించింది. మొత్తంగా 2.11 లక్షల ఎకరాలకుగాను 2,03,060 ఎకరాల్లోనే పంట సాగైందని తేల్చారు.

అస్తవ్యస్త డ్రెయిన్లతో అవస్థలు.. డెల్టాలో వశిష్ఠ, కొల్లేరు, ఉప్పుటేరు బేసిన్ల పరిధిలో 21 మేజర్, 59 మీడియం, 579 మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. వైకాపా హయాంలో వీటి నిర్వహణ, పూడిక, ఆక్రమణల తొలగింపు వంటి పనులు చేపట్టకపోవడంతో మురుగు పారుదల వ్యవస్థ అధ్వానంగా మారింది. రెండ్రోజులు వర్షాలు కురిస్తే చాలు పల్లపు ప్రాంతాల్లో చేలు ముంపు బారిన పడుతున్నాయి.

నష్ట నివారణకు ముందస్తు చర్యలు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. ముంపు ప్రభావిత ప్రాంతాలను ముందే గుర్తించి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కాలువలు, డ్రెయిన్లలో ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. పంట నష్టం తగ్గించేలా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను, కాలువల్లో నీటి మట్టాన్ని నిరంతరం పర్యవేక్షించాలని జలవనరుల శాఖాధికారులను ఆదేశించారు. అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు.

☛ ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగే పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో రూ.51.03 కోట్లతో 423 పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల వివరాలను ముందుగానే స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు.

సిండికేట్లకు ఎదురుదెబ్బ!

☛ గడువు పెంచాక వెల్లువెత్తిన దరఖాస్తులు ☛ మద్యం దుకాణాలకు నేడు లాటరీ



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

భీమవరం పట్టణం, అర్బన్, ఆకివీడు, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. 175 దుకాణాలకు ఏకంగా 5,627 దరఖాస్తులు రావడం సిండికేట్ వ్యాపారులను విస్మయానికి గురిచేసింది. తొలుత ప్రకటించిన ప్రకారం గడువు ఈ నెల 9వ తేదీకి ముగియగా ప్రభుత్వం 11వ తేదీ వరకు పొడిగించింది. అప్పటి వరకు సిండికేట్ల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో దుకాణాలకు దరఖాస్తులు నామమాత్రంగా వచ్చాయి. గడువు పెంచాక రెట్టింపు స్థాయిలో దాఖలయ్యాయి. చివరి రోజు సుమారు 2,210 దరఖాస్తులు అందాయంటే పోటీ తీవ్రత అర్థమవుతోంది. స్థానిక సిండికేట్లతో సంబంధం లేకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు, విదేశాల్లో స్థిరపడినవారి చేయూతతో వారు బంధుమిత్రులు కూడా దరఖాస్తు చేసి ఉండొచ్చని భావిస్తున్నారు.

ఒత్తిళ్లను లెక్క చేయక..!

కొన్ని ప్రాంతాల్లో దుకాణాలకు సంబంధించి రాజకీయ ఒత్తిళ్లను వ్యాపారులు లెక్క చేయకుండా దరఖాస్తు చేసినట్లు సమాచారం. ఒకవేళ దుకాణం దక్కి వ్యాపారం విషయంలో రాజకీయ జోక్యం పెచ్చుమీరితే నేరుగా సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలనే యోచనలో వ్యాపారులు ఉన్నారు.

● భీమవరంలో కొన్ని దుకాణాలకు సిండికేట్ల సమష్టి నిర్ణయంతో తొలుత 253 దరఖాస్తులు అందాయి. గడువు ముగిసే సమయానికి ఏకంగా 510 దరఖాస్తులు వచ్చాయి.

● ఉండి మండలంలో నాలుగు దుకాణాల ఏర్పాటుకు మాత్రమే అవకాశం ఇచ్చారు. ఇక్కడ విక్రయాలు అధికంగా ఉంటాయనే అంచనా ఉండటంతో 138 దరఖాస్తులు అందాయి. ఈ నియోజకవర్గంలో మూడు మండలాల్లో దుకాణాలకు ఒకే వ్యక్తి 75 దరఖాస్తులు దాఖలు చేశారని అధికారులు తెలిపారు. వీటిలో శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకు అంటే గడువు సమీపించాక అందినవే ఎక్కువ.

ఏర్పాట్లు పూర్తి.. మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియను సోమవారం నిర్వహిస్తారు. ఈ మేరకు కాళ్ల మండలం పెదఅమిరంలోని నిర్మలా దేవి వేడుక హాలులో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుంచి గెజిట్ నంబరు, సర్కిల్ వారీగా లాటరీ నిర్వహిస్తామని కలెక్టర్ నాగరాణి తెలిపారు. దరఖాస్తుదారు అనుమతి పత్రం చూపించి లోపలికి ప్రవేశించాలన్నారు. ఇతర వ్యక్తులు రావాలంటే దరఖాస్తుదారు నుంచి ధ్రువపత్రం, గుర్తింపుకార్డుల నకళ్లు వెంట తెచ్చుకోవాలని సూచించారు. దుకాణం దక్కించుకున్నవారు లైసెన్సు రుసుములో తొలి విడత మొత్తాన్ని చెల్లించాలి. కేంద్రం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కుమారేశ్వరన్, డీఎస్పీ జయసూర్య తదితరులు కేంద్రంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

దేవుడిలా వచ్చాడు..!

- యువకుడి సాహసం..
- ఇద్దరికి పునర్జన్మ



కాలువలో పడిపోయిన కారులో వ్యక్తులను కాపాడటానికి ప్రయత్నిస్తున్న సాయిబాబు (అంతరచిత్రం)

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆ యువకుడు చూపించిన తెగువ, ధైర్యం ఇద్దరికి పునర్జన్మనిచ్చింది. కాలువలో కారు మునిగిపోతుంటే అయ్యో అంటూ చూస్తున్నారే తప్ప ఎవరు దిగేందుకు సాహసం చేయలేదు. ఓ యువకుడు మాత్రం ఏం ఆలోచించకుండా వారిని రక్షించాలన్న లక్ష్యంతో కాలువలోకి దూకేశారు. ఇంతకీ అతడికి ఈత రాకపోవడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. తణుకుకు చెందిన దాసరి రాంబాబు ప్రైవేటు పరిశ్రమలో ఉద్యోగి. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె మౌనికదేవి చెన్నైలో ఉద్యోగం చేస్తూ దసరా సెలవులకు వచ్చింది. శనివారం తండ్రితో కలిసి కారులో మండపాక యల్లారమ్మ ఆలయానికి బయల్దేరారు. వెంకటరాయపురం ఆంధ్ర సుగర్స్ వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి గోస్తనీ కాల్వలోకి దూసుకెళ్లింది. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న పెరవలి మండలం నల్లాకులవారిపాలెంకు చెందిన మెర్ల సాయిబాబు తన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కాలువలోకి దూకి వారిని రక్షించే ప్రయత్నం చేశారు. రోడ్డుపై ఉన్న మరో వ్యక్తి అతనికి అందించిన సుత్తితో కారు అద్దాలు పగలుగొట్టి ఇద్దరినీ ప్రాణాలతో ఒడ్డుకు తెచ్చారు. ఈత రాకపోయినా ప్రాణాలకు తెగించి, వారిని కాపాడటంతో స్థానికులు అతడిని అభినందించారు.

● రాంబాబు భార్య కొన్ని నెలలుగా మంచానికే పరిమితమయ్యారు. ఈ తరుణంలో కారులో మునిగిపోతుండగా ఆమె పరిస్థితి ఏమిటి..? ఆమెను ఎవరు చూసుకుంటారు...? అనే ఆలోచన తనను కలచివేసిందంటూ సాయిబాబును రాంబాబును హత్తుకుని కన్నీరు మున్నీరయ్యారు. ● స్థానిక తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ, సాయిబాబును ఘనంగా సత్కరించారు. సాయిబాబుకు జ్ఞాపిక అందించి, రూ.10వేల నగదు బహుమతిగా అందించి, అభినందించారు.

లెక్క తేల్చనున్న విజిలెన్స్!

మార్కెట్ యార్డుల ఆదాయ, వ్యయాలపై తనిఖీలు



వీరవాసరం, న్యూస్‌టుడే: రైతు సేవల కోసం ఏర్పడిన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లు గత వైకాపా ప్రభుత్వ హయాంలో వారి శ్రేయస్సును విస్మరించాయి. మార్కెట్ యార్డుల ఆదాయాన్ని వైకాపా సర్కారు దారి మళ్లించడంతో రైతులకు అవసరమయ్యే పంత మార్గాలు, నూర్పిడి కల్లాలు అభివృద్ధికి నోచుకోలేదు. కొన్ని యార్డుల పరిధిలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం గత కమిటీలను రద్దు చేయడంతోపాటు ఆదాయ, వ్యయాల లెక్కతేల్చేందుకు జిల్లాల వారీగా విజిలెన్సు కమిటీలను ఏర్పాటు చేసింది.

ఈ నెలలో ప్రారంభం.. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సమయంలో తనిఖీ కేంద్రాల ద్వారా రెండు శాతం పన్ను వసూలు చేస్తారు. కొన్ని చోట్ల సిబ్బంది చేతివాటంతో ఆదాయం దారి మళ్లుతుందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు మార్కెట్ కమిటీల ద్వారా లైసెన్సులు పొందిన ఆక్వా వ్యాపారులు విధిగా రుసుములు చెల్లిస్తున్నారా.. ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలు చేశారా లేదా అనే అంశాలను విజిలెన్సు కమిటీ పరిశీలించనుంది. ఈ నెలలోనే తనిఖీలు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఆదాయ, వ్యయాలకు సంబంధించి అన్ని మార్కెట్ యార్డులు, తనిఖీ కేంద్రాల్లో దస్త్రాలను పరిశీలిస్తామని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి కె.సునీల్‌కుమార్ తెలిపారు.

ఆదాయం రూ.100 కోట్లు.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 19 మార్కెట్ యార్డులు ఉండగా వీటి పరిధిలో ఉన్న 50 తనిఖీ కేంద్రాల ద్వారా ఏటా సగటున రూ.100 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఏలూరు జిల్లాలో 9 యార్డుల ద్వారా రూ.40 కోట్లు, పశ్చిమగోదావరిలో 10 యార్డుల ద్వారా రూ.60 కోట్లు ఆదాయం వస్తోంది.

కమిటీ సభ్యులు వీరే.. పశ్చిమగోదావరి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.సునీల్ కుమార్ నేతృత్వంలో తాడేపల్లిగూడెం, ఉండి, ఆకివీడు యార్డుల కార్యదర్శులు విజిలెన్సు కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.



(c) eenadu

గరళ గోదారి..!




స్వచ్ఛమైన గోదావరి నదిలో వ్యర్థ జలాలు చేరడంతో కలుషితమవుతోంది. నరసాపురం పురపాలక సంఘం పరిధిలోని మురుగు నీటిని శుద్ధిచేయడం లేదు. కాలువల నుంచి నేరుగా గోదావరిలో కలుస్తోంది. దుర్గంధాన్ని భరించలేకపోతున్నామని ఘాట్లలో స్నానాలు చేసే భక్తులు చెబుతున్నారు. అధికారులు పరిశీలించి మురుగు నీటిని శుద్ధిచేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై నరసాపురం పురపాలక కమిషనర్ మల్లారపు అంజయ్య మాట్లాడుతూ తాను ఇటీవలే వచ్చానని క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. నరసాపురంలోని మహాప్రస్థానం సమీపంలోని ఎర్రని గోదావరిలో నల్లని మురుగు కలుస్తున్న చిత్రాలివి.

- ఈనాడు, నరసాపురం

అంతు లేని భూ దాహం



● భీమడోలు మండలం పూళ్లలోని సర్వే నంబర్ 700-710 మధ్యలో దాదాపు 11.6 ఎకరాల భూమి రికార్డులను అడ్డగోలుగా మార్చేశారు. దశాబ్దాల కిందట పేదలకు భూదాన ఉద్యమంలో ఇచ్చిన భూములను అనువంశికంగా సక్రమించినట్లు రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి 1బీ అడంగల్ సృష్టించారు. దీంతో పేదలకు చెందాల్సిన భూదాన్ భూమి పెద్దల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయింది.

● భీమడోలు మండలం పరిధిలోని అభయారణ్యంలో దాదాపు 130 ఎకరాలు భీమవరానికి చెందిన వైకాపా నేత కొన్నేళ్ల కిందట ఆక్రమించుకున్నారు. అయిదో కాంటూరు పరిధిలోని అభయారణ్యంలో ఆక్రమణలు నేరం. అయినా దశాబ్దాలుగా ఏ అధికారి కన్నెత్తి చూడలేదు. వైకాపా పాలనలో అదే అదనుగా రికార్డులు మార్చి అభయారణ్యం నుంచి తొలగించి పట్టాలు పుట్టించారు.

ఈనాడు, ఏలూరు: జిల్లాలో అసైన్డ్, భూదాన్, కొల్లేరు అయిదో కాంటూరులోని అభయారణ్యం భూములు రెండు లక్షల ఎకరాల వరకు ఉన్నాయి. భూదాన్, అసైన్డ్ భూములను భూముల్లేని పేదలకు ప్రభుత్వం గతంలోనే ఇచ్చింది. స్థానిక తహసీల్దారు ద్వారా లబ్ధిదారులు పట్టా పొందాలి. అప్పుడే ఆ భూమి వారి పేరుకు మారుతుంది. కానీ ఈ విషయం తెలియని చాలా మంది పట్టాలు తీసుకోలేదు. కొన్ని చోట్ల కాగితాల్లో భూ పంపకాలు జరిగినా క్షేత్రస్థాయిలో మాత్రం అప్పటి భూస్వాములే సాగు చేస్తున్నారు.

చక్రం తిప్పిన అధికారి.. భీమడోలులో ఈ తరహా కుంభ కోణంలో గతంలో విధులు నిర్వహించిన అధికారి ఒకరు కీలకంగా వ్యవహరించారు. స్థానిక వైకాపా నేతల అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. పాత రికార్డుల్లో భూదాన్ భూములుగా ఉన్న వేలాది ఎకరాల భూములు అనువంశికం అంటూ మార్చేశారు. ఒక్క భీమడోలు మండలంలోని పూళ్ల, ఎంఎంపురం, కొండ్రుపాడు తదితర గ్రామాల్లో ఈ తరహా అక్రమాలకు పాల్పడ్డారు. అసైన్డ్ భూములు పంపకాలు చేసినప్పుడు ఎంఎంపురంలో ఓ ఎకరం భూమి కొల్లేరు అభయారణ్యంలో చూపించడంతో లబ్ధిదారులకు ఇవ్వలేదు. అలాంటి భూమిని సైతం ఆ ముడుపులు తీసుకుని మార్చేశారు. ఎకరం భూమి రికార్డు మారిస్తే రూ.2 లక్షల వరకు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు వీఆర్వోల సాయంతో ఈ బాగోతం నడిపారు.

కొల్లేరు అయిదో కాంటూరు పరిధిలో ఆక్రమణలు, చెరువుల సాగు చేయడం నిషేధం. ఆగడాలలంక, చెట్టున్నపాడు, ఎంఎంపురం ఇలా ప్రతి చోటా కొల్లేరు పరిధిలోని భూములను రెవెన్యూ భూములగా మార్చేశారు. రూ.కోట్లు సంపాదించి ఇటీవలే మరో మండలానికి బదిలీపై వెళ్లిపోయారు. దీనిపై జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ పాత రికార్డులు పరిశీలించి అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దేశాలమ్మకు మకరతోరణం అలంకరణ

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణం లాకు దిగువన కొలువైన దేశాలమ్మ అమ్మవారికి రూ.3 లక్షల విలువైన వెండి మకర తోరణాన్ని దాతలు ఆదివారం అందజేశారు. పట్టణానికి చెందిన అడబాల వెంకటరమణ, వాణి దంపతులు ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అర్చకులు పూజలు జరిపించి అమ్మవారికి అలంకరించారు. కమిటీ సభ్యులు వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందించారు.


ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తున్న దాతలు

మందాలమ్మకు బంగారు కర్ణాభరణాలు..

పెనుగొండ, న్యూస్‌టుడే: వడలి గ్రామ దేవత మందాలమ్మకు హైదరాబాద్‌కు చెందిన ఓరుగంటి శ్రీనివాస్, నందన దంపతులు రూ.2,34,000 విలువ గల 34 గ్రాముల బంగారు కర్ణాభరణాలను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం పూజలు చేసి అమ్మవారికి అలకరించారు.


ఆలయ కమిటీ సభ్యులకు కర్ణాభరణాలు అందిస్తున్న శ్రీనివాస్, నందన దంపతులు

తిరుమలకు సైకిల్ యాత్ర

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు నుంచి తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనార్థం గోవిందస్వామి దీక్షా పరులు ఆదివారం సైకిల్‌పై యాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా పాలకొల్లు కెనాల్ రోడ్డులో వేంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చకుడు శ్రీనివాసాచార్యులు పూజలు చేశారు. ద్వారకాతిరుమల వేంకన్న, విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని తిరుమలకు తిరుపతికి వెళ్తామని దీక్షాపరులు తెలిపారు.


బయలుదేరుతున్న దీక్షాపరులు

హంస వాహనంపై మావుళ్లమ్మ ఊరేగింపు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ విజయదశమి రోజున రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని హంస వాహనంలో కొలువుదీర్చి ఆలయం నుంచి ప్రధాన రహదారుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఊరేగింపును ప్రారంభించారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అమ్మవారిని దర్శించారు. ఆదివారం అమ్మవారిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దర్శించుకున్నారు. తెలంగాణకు చెందిన కె.కవితాఆనంద్ దంపతులు 303 గ్రాములు, భీమవరం వాసి గుండ నాగ వెంకట కృష్ణవర్మ 250 గ్రాముల చొప్పున వెండిని అమ్మవారికి సమర్పించారు.


హంస వాహనం వద్ద ఆలయాధికారులు, కమిటీ ప్రతినిధులు

వరద బాధితులకు చేయూత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం భీమవరం బార్ అసోసియేషన్ తరపున రూ.1,11,111 ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు చెక్కును ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు ఆదివారం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు [illegible] న్యూటన్, ఉపాధ్యక్షుడు కె.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి ఎ.ప్రసన్నకుమార్, కోశాధికారి సీహెచ్ పరాలరావు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రామాంజనేయులుకు చెక్కు అందిస్తున్న భీమవరం బార్ అసోసియేషన్ ప్రతినిధులు

ఉండి నియోజకవర్గ అభివృద్ధికి..

మాజీ ఎంపీ రూ.కోటి విరాళం

కోలమూరు (ఉండి), న్యూస్‌టుడే: ఉండి నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోటి విరాళం అందజేస్తున్నట్లు మాజీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రకటించారు. ఉండి మండలం కోలమూరు గ్రామంలో పేరిచర్ల బాలరాజుకు చెందిన ఆక్వా మేతల దుకాణాన్ని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజులతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.కోటి విరాళం ప్రకటించడం హర్షణీయం. ఇది నిజమైన విజయదశమి అని అభివర్ణించారు. మా మిత్రుడు, కాబోయే రాజ్యసభ సభ్యుడు ఇచ్చిన ఈ విరాళం ప్రభుత్వం ఇచ్చే రూ.5 కోట్లతో సమానంగా తాను భావిస్తున్నానని తెలిపారు. చెరువు సాంద్రత ఆధారంగా రొయ్య సీడ్ వేయాలని సూచించారు. విద్యుత్తు రాయితీ అంశాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి సంక్రాంతికి ఆక్వా రైతులకు శుభవార్త చెప్పనున్నామని వివరించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, తెదేపా, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మస్తాన్‌రావుతో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, చిత్రంలో ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు

మాటేసి.. కాటేసి!

కుక్కల బెడదతో బెంబేలు



జంగారెడ్డిగూడెం పట్టణం, చింతలపూడి, నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

● జంగారెడ్డిగూడేనికి చెందిన ఓ యువకుడు ఈ నెల 1న స్థానిక ప్రభుత్వ కళాశాల రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతూ కుక్కల గుంపును చూసి భయంతో వాహనం వేగం పెంచాడు. అయితే అవి వెంటబడటంతో వాటి నుంచి తప్పించుకునే క్రమంలో వాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. రక్తగాయాలయ్యాయి.

● పోలవరంలో సెప్టెంబరు 20న ఆరేళ్ల బాలికపై వీధికుక్కలు దాడి చేశాయి. అదే రోజు రోడ్డుపై వెళుతున్న మరో నలుగురిని కరవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.

వివరాలు ఇలా..

సంవత్సరం	ప్రాంతీయ ఆసుపత్రి	కుక్కకాటు బాధితులు
2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ...	జంగారెడ్డిగూడెం	1015
2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ....	జంగారెడ్డిగూడెం	558
2023	నూజివీడు	2036
2024 ఇప్పటి వరకూ...	నూజివీడు	1396
2024 జనవరి నుంచి ఇప్పటి వరకూ...	చింతలపూడి	308

● టి.నరసాపురం మండలం రాజుపోతేపల్లిలో ఈ నెల 9న ముగ్గురు వ్యక్తులపై కుక్కల గుంపు దాడిచేసింది. గాయపడిన వారిని కుటుంబసభ్యులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● మూడు నెలల కిందట నూజివీడు మండలం వెంకటాయపాలెంలో ఓ బాలుడు, నూజివీడు బాపూనగర్‌లో ఓ వృద్ధురాలిపై కుక్కలు దాడిచేశాయి.


జంగారెడ్డిగూడెం పట్టణంలో శునకాల సంచారం

చింతలపూడి, నూజివీడు, పోలవరం నియోజకవర్గాల్లో గ్రామ సింహాల బెడదతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒంటరిగా బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రోడ్డుపై నడిచి వెళ్లే వారినే కాకుండా ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారిపై సైతం దాడులు చేస్తున్నాయి. దీంతో చింతలపూడి నియోజకవర్గంలో కుక్కకాటు బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. బాధితుల్లో కొందరు ఆసుపత్రులకు వెళుతుంటే మరికొందరు నాటు వైద్యం, పసరు మందులు వాడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం పురపాలక కమిషనర్ కేవీ రమణ తెలిపారు. శునకాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా ఘటన జరిగితే తప్ప అధికారుల్లో చలనం ఉండటం లేదని ప్రజలు బాహాటంగానే ఆరోపిస్తున్నారు.

ఉచితంగా డీఎస్సీ శిక్షణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిభావంతులైన పేద, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి కె.శోభారాణి తెలిపారు. టెట్‌లో ఉత్తీర్ణులైన వారికి ప్రాథమిక పరీక్ష నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 21లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ముగ్గురు నకిలీ పోలీసుల అరెస్టు

మొగల్తూరు, న్యూస్‌టుడే: పోలీసుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై జి.వాసు తెలిపారు. ఎస్సై కథనం మేరకు ఈ నెల 11న మండ శ్రీనువాసు, అతని సోదరుడు అనిల్ కుమార్‌తో కలిసి మోళ్లపర్రు బీచ్‌లో ఉండగా. . గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు తాము పోలీసులమని చెప్పి వారి వద్ద రూ.500 లాక్కుని వెళ్లారు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన దావులూరి సువర్ణరాజు, దిరుసుమర్రులోని పెదపేటకు చెందిన వర్ధనపు ప్రసాద్, శ్రీరామపురం పంచాయతీ సత్యనారాయణపురానికి చెందిన మండ కిరణ్‌కుమార్‌లను నిందితులుగా గుర్తించామన్నారు. వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండు విధించినట్లు ఎస్సై తెలిపారు.


నిందితులతో ఎస్సై వాసు, సిబ్బంది

ఎన్నికల సాకు.. పైపైసోకు!

మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలు

గుత్తేదారు కాసుల కక్కుర్తి.. అధికారుల ధన దాహార్తి.. వెరసి రోడ్డు మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చారు. ఫలితంగా రూ.కోటి వెచ్చించి చేపట్టిన పనులు ఆర్నెల్లకే అధ్వానంగా తయారయ్యాయి. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే, తామంతా ఎన్నికల విధుల్లో ఉన్నామని, పనులను పర్యవేక్షించలేకపోయామని చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, దెందులూరు, ఏలూరు గ్రామీణ

జిల్లా కేంద్రం ఏలూరు నగరంలో ర.భ. శాఖకు చెందిన ఎం.డి.ఆర్. రోడ్లకు వైకాపా ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. ఈ నిధులతో ఏలూరు చాటపర్రు రోడ్డు నుంచి కైకలూరు రోడ్డు వరకు(ఫిల్‌హౌస్‌పేట మీదుగా వెళ్లు రహదారి), ఏలూరు జూట్‌మిల్లు వంతెన నుంచి గడియారపు స్తంభం మీదుగా కైకలూరు రోడ్డు, ఏలూరు పాత బస్టాండు నుంచి గజ్జలవారిచెరువు మీదుగా చాటపర్రు రహదారి, ఏలూరు పాత బస్టాండ్ నుంచి కొమడవోలు రహదారికి అత్యవసర మరమ్మతులు చేయాలని ఆదేశించింది. ఈ పనులకు అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల నాని జనవరి 22న శంకుస్థాపన చేశారు. సాధారణ ఎన్నికల ప్రవర్తన నియమావళి విడుదల అవుతుందోమోనని హడావుడిగా మరమ్మతులు పూర్తి చేశారు. ఈ నాలుగు రహదారుల్లో ఒకటైన ఫిల్‌హౌస్‌పేట రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించారు. మిగతా రోడ్లకు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి మాయ చేశారు.


అధ్వానంగా ఫిల్‌హౌస్ పేట రోడ్డు

నేతి బీర చందం..

ఈ పనుల్లో నాణ్యత నేతి బీర చందంగా మారింది. రహదారుల పరిస్థితి మూణ్నాళ్ల ముచ్చటగా తయారైంది. తొలకరి వర్షాలు కురిసిన కొన్నాళ్లకే రోడ్లకు గుంతలు పడటం మొదలైంది. ఇటీవల కురిసిన భారీ వానలకు మరింత ఛిద్రమయ్యాయి. ప్రధానంగా ఫిల్‌హౌస్‌పేట రహదారిలో రాకపోకలు సాగించేందుకు చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్యనారాయణ థియేటర్ కూడలిలో భారీ గుంతలు పడ్డాయి. గూడ్స్ షెడ్ రోడ్డు మినహా మిగతా మూడు రోడ్లు కైకలూరు రహదారిని కలిపే దగ్గర మార్గాలు. కైకలూరు మీదుగా భీమవరం, పాలకొల్లు, నరసాపురం వెళ్లే వాహనాలు ఈ రహదారుల్లోనే రాకపోకలు సాగిస్తుంటాయి. కొల్లేరు లంక గ్రామాలకు వెళ్లే వాహనాలకు ఈ దారులే ఆధారం. ప్రధాన రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ డీఈఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా... ఆయన అందుబాటులోకి రాలేదు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచి మృతి

కుక్కునూరు, అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ మృతి చెందిన దుర్ఘటన ఆదివారం రాత్రి అశ్వారావుపేట మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కుక్కునూరు మండలం వింజరం పంచాయతీ సర్పంచి జగిడి బాలరాజు(34) స్వగ్రామం బర్లమడుగు నుంచి ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట మండలం నందిపాడు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అతను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనానికి కుడుములపాడు వద్ద కుక్క అడ్డు రావడంతో దాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి పడిపోవడంతో బాలరాజు తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడ్ని స్థానికులు ఆటోలో అశ్వారావుపేట సీహెచ్‌సీకి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుని భార్య పుష్పాంజలి కుక్కునూరు గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.


బాలరాజు (పాత చిత్రం)

పాల వాహనాన్ని ఢీకొన్న వ్యాన్

ఆరుగురు భవానీ భక్తులకు గాయాలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన నిలిపి ఉన్న పాల వాహనాన్ని భవానీ భక్తులు ప్రయాణిస్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ముకందరాజుపేటకు చెందిన ఎనిమిది మంది భవానీ భక్తులు ఓ వ్యానులో విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్తున్నారు. మార్గం మధ్యలోని శివారు ఆశ్రం సమీపాన జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు పక్కన ఆపి ఉన్న పాల వాహనాన్ని వ్యాన్ ఢీకొంది. ప్రమాదంలో ఆరుగురు భవానీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు తీవ్రంగా గాయపడగా- వారిని మెరుగైన వైద్య సేవల నిమిత్తం విజయవాడ తీసుకెళ్లారు. బాధితుల్లో ఒకరైన చెప్పా మాలశ్రీ ఫిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మెరుగైన వైద్యం అందించండి.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన భవానీ భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ప్రమాద బాధితులకు అండగా ఉండాలని స్థానిక భాజపా నేతలకు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెనుగొండ గ్రామీణ, రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ మహిళ రావులపాలెం వద్ద గౌతమి వారధిపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం మేరకు. . పెనుగొండ మండలం నడిపూడి గ్రామానికి చెందిన వెన్నేటి రాజేశ్వరి(35), భర్త వెన్నేటి శ్రీనివాసుల శనివారం రాత్రి గొడవ పడ్డారు. మనస్తాపంతో రాజేశ్వరి అదే రోజు ఆత్మహత్యయత్నం చేయగా భర్త అడ్డుకున్నారని బంధువులు తెలిపారు. ఆదివారం ఉదయం ఆమె రాజమహేంద్రవరం బస్సు ఎక్కి వెళ్తుండగా భర్త శ్రీనివాసు కూడా వెనుక బస్సులో ఆమె కోసం వెళ్లారు. ఆమె అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం వద్ద గౌతమి బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకారు. గమనించిన స్థానిక జాలర్లు నావపై వెళ్లి ఆమెను కాపాడారు. విషయం తెలుసుకున్న టౌన్ హెచ్‌సీ నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని యువతిని రావులపాలెం ఆసుపత్రికి తరలించారు. భర్త శ్రీనివాసరావుకు పోలీసులు కౌన్సెలింగ్ చేసి భార్యను అప్పగించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

అమ్మే లోకమని.. ఆమె లేక జీవించలేనని!

అతనికి అమ్మే లోకం.. ఆమె సర్వస్వం.. నాలుగేళ్ల వయసులో నాన్న చనిపోగా- అన్నీతానైంది తల్లి. ఎన్నడూ తండ్రి లేదన్న భావన కలగకుండా పెంచింది.. ఆయనకు పెళ్లయి ఇద్దరు పిల్లలకు తండ్రైనా, 50 వసంతాలొచ్చినా, తల్లిచాటు బిడ్డగానే ఉంటున్నారు. అలాంటి మాతృమూర్తి మరణాన్ని తట్టుకోలేక... ఆమెకు అంత్యక్రియలు నిర్వహించిన 24 గంటల్లోనే అతని గుండె ఆగింది. ఈ హృదయ విదారక సంఘటన పెదవేగి మండలంలో చోటుచేసుకుంది.

- న్యూస్‌టుడే, పెదవేగి


వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

కూచింపూడికి చెందిన ఏనుగు గంగమ్మ(80) వృద్ధాప్యం రీత్యా శుక్రవారం మృతి చెందారు. కుమారుడు వెంకటేశ్వరరావు(50) తల్లికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తిచేశారు. సాయంత్రం ఇంటికి వచ్చినప్పటి నుంచి ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా రోదిస్తున్నారు. అమ్మనే తలచుకుంటూ రాత్రంతా నిద్రించలేదు. ఈ క్రమంలో శనివారం ఉదయం గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. వెంకటేశ్వరరావు నాలుగేళ్ల వయసులోనే తండ్రి మరణించారు. దాంతో తల్లి గంగమ్మ అన్నీతానై కుమారుడ్ని పెంచింది. అతనికి వివాహం కాగా, ఇద్దరు పిల్లలున్నారు. 24 గంటల వ్యవధిలో తల్లి, కుమారుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

వివాహం ఆలస్యమవుతోందని యువకుడి బలవన్మరణం

పటాన్‌చెర్వు అర్బన్, న్యూస్‌టుడే: ఓ యువకుడు పెళ్లి ఆలస్యం అవుతుందని మనస్తాపంతో వాట్సప్‌లో స్టేటస్ పెట్టి ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆకివీడు గ్రామానికి చెందిన నాగమణి పదేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయింది. పటాన్‌చెర్వు రామమందిర్ రహదారిలో కుమారుడు ఫణివర్మ(29)తో కలిసి ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. తన కుమారుడు ఫణివర్మ చుట్టాల అమ్మాయిని ప్రేమించడంతో వారి తల్లిదండ్రులతో మాట్లాడి పెళ్లి కుదిర్చింది. ఏడాది తర్వాత వివాహం చేద్దామని అందరూ అనుకున్నారు. దీనికి మనస్తాపం చెందిన ఫణివర్మ ఈనెల 12న తల్లి ఉద్యోగానికి వెళ్లిన సమయంలో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వాట్సప్ స్టేటస్‌లో పెట్టి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లోపల గడియపెట్టుకుని ఉండటంతో వెనక నుంచి లోపలికి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, వెండి చోరీ

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ కోడిపందెలదిబ్బ కాలనీలో నివసిస్తున్న వేంద్ర కావ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు బంగారం, వెండి చోరీ చేసినట్లు పెనుగొండ పోలీసులు ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కావ్య బుధవారం వేరే ప్రాంతానికి వెళ్లి తిరిగి శనివారం సాయంత్రం ఇంటికి వచ్చే సరికి వెనుక తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలో 3 కాసులు బంగారం, 15 తులాలు వెండి కనపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్టేషన్ రైటర్ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.



అలరించిన హరివిల్లు

ఆకివీడు, ఉండి, న్యూస్‌టుడే: విజయదశమి రోజున ఉదయం ఆకాశంలో హరివిల్లు కనువిందు చేసింది. శనివారం సూర్యోదయం సమయంలో ఆకివీడు, ఉండి మండలాల పరిధిలో పడమర దిక్కున ఇంద్రధనస్సు స్పష్టంగా కనిపించింది.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ దర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 91699 22299.

REAL ESTATE

FLAT FOR SALE

దసరా ఆఫర్. 5 గ్రా.ల గోల్డ్ ఫ్రీ. రాజమండ్రిలో గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న లగ్జరీ Flats Sft. 2,900/- నుండి 5,600/-, ఓపెన్ ప్లాట్స్ గజం 6,000 నుండి 28,000 వరకు. ✆ 89889 84333.

JOBS

నూతనముగా ప్రారంభించబడుతున్న SMC హాస్పటల్ కొరకు అర్హత మరియు అనుభవం కల్గిన MBBS డాక్టర్, స్టాఫ్ నర్స్ ANM, ఫార్మసిస్ట్ ల్యాబ్ టెక్నీషియన్, ట్యాలీ అనుభవంతో అకౌంటెంట్, కంప్యూటర్ నాలెడ్జ్ కల్గిన రిసెప్షనిస్ట్ కావలెను. వసతి సదుపాయం కలదు. ఇంటర్వ్యూ 16-10-24 బుధవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 వరకు. SMC హాస్పటల్, పెదవేగి (V) & మండలం, ఏలూరు జిల్లా. ✆ 96181 16282.

హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను / పేషెంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 15K. ✆ 96405 28899, 96406 48899

వర్క్ ఫ్రం హోమ్ డేటాఎంట్రీ : ప్రముఖ ఔట్ సోర్సింగ్ సంస్థ నందు ఇంటి వద్ద ఉండి పార్ట్ / ఫుల్ టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop / Desktop, స్మార్ట్ ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 95534 29993.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.25 పైII

తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

భీమవరం

● భీమవరం ● ఉండి

కిక్కిరిసిన బస్సులు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: దసరా పండగకు వచ్చిన వారంతా ఆదివారం తిరుగు ప్రయాణం కావడంతో భీమవరంలో బస్టాండ్లు కిటకిటలాడాయి. కొన్ని మార్గాల్లో వెళ్లాల్సిన వారు బస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. రద్దీ నేపథ్యంలో జిల్లాలో నాలుగు డిపోల నుంచి హైదరాబాద్, ఇతర దూర ప్రాంతాలకు ఆర్టీసీ అదనపు సర్వీసులను ఏర్పాటు చేసింది.



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

సాయి సత్యవ్రతాలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: శిర్డీ సాయిబాబా పుణ్యతిథి సందర్భంగా హౌసింగ్ బోర్డు కాలనీలోని వెంకటసాయిబాబా మందిరంలో క్షీరాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం మందిరం ఎదుట భక్తులతో సామూహికంగా సాయి సత్యవ్రతాలు చేయించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467

కాళ్ల : 80085 74474

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: చినరంగనిపాలెం పరిధిలో గోస్తనీ- వేల్పూరు కాలువ గట్టు మార్గం వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. **- బి.సూరిబాబు, స్థానికుడు**

సమస్య: శ్రీరామపురం రహదారి పూర్తిగా పాడైపోయింది. భీమవరం మండలంలో పలు గ్రామాలకు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. **- రాజ్‌కుమార్, ప్రైవేటు ఉద్యోగి**

సమస్య: ప్రకాశంచౌక్ వద్ద పల్లపు ప్రాంతంలో మురుగు రహదారిపై నిలిచిపోతోంది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- జి.సత్యనారాయణ, ఉండి**

సమాధానం: భీమవరం పట్టణ పరిధిలో కొన్నిచోట్ల రహదారులకు ఇప్పటికే మరమ్మతులు చేయించాం. మిగిలిన చోట్ల పనులు జరుగుతున్నాయి. సమస్య ఉన్న ప్రాంతాలను పరిశీలించి తగు చర్యలు చేపడతాం. **- పి.త్రినాథరావు, ఎంఈ**

పాలకోడేరు, న్యూస్‌టుడే

సమస్య: వేండ్రలో గోస్తనీ వంతెన వద్ద రహదారి పక్కన వ్యర్థాలు భారీగా పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. **- పి.నాగేశ్వరరావు, వేండ్ర**

సమాధానం: ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- జి.కృష్ణమోహన్, కార్యదర్శి, వేండ్ర**

మురుగు సాగదు.. ముంపు తప్పదు!

అసంపూర్తి పనులతో నిత్యం అవస్థలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో డ్రెయిన్ల అసంపూర్తి నిర్మాణాలతో మురుగు పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. 39 వార్డుల్లో పరిశీలిస్తే పలు ప్రాంతాల్లో డ్రెయిన్ కంటే రహదారులు పల్లంగా ఉంటాయి. కొన్నిచోట్ల డ్రెయిన్‌కు, రహదారికి పొంతన లేకుండా పనులు చేశారు. దీంతో రూ.లక్షల వ్యయంతో డ్రెయిన్లు నిర్మించినా మురుగు, ముంపు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి.

● పట్టణంలో బుధవారం మార్కెట్ కూడలిలో పైవంతెన దిగువన ఏడాది పొడవునా ఇలా మురుగు నిలిచి ఉంటుంది. డ్రెయిన్ పనులు అర్ధాంతరం నిలిచిపోవడంతో పలు ప్రాంతాలకు ముంపు బెడద తప్పడంలేదు.



● రైల్వే జంక్షన్ నుంచి శ్రీనివాస కూడలి వరకు అసంపూర్తిగా వదిలేసిన డ్రెయిన్ ఇది. 13వ ఆర్థిక సంఘం నిధులు రూ. 20 లక్షలతో దీనిని నిర్మించగా.. మురుగుకు బయటకు వెళ్లే మార్గం ఏర్పాటు చేయకుండా వదిలేశారు.



సమస్యలెన్నో..

పట్టణంలో రహదారి పనులు వేగవంతంగా జరుగుతాయి. డ్రెయినేజీల నిర్మాణాలకు మాత్రం టెండరు వేసేందుకు గుత్తేదారులు ఆసక్తి చూపరు. ఈ పనులకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు సరిహద్దులను గుర్తించి అప్పగిస్తారు. కానీ స్థానికుల నుంచి అభ్యంతరాలు, ఇతర సమస్యలు వస్తే పరిష్కరించరు. ఈ క్రమంలో కొంతమేర డ్రెయిన్ నిర్మించాక పని ఆగిపోతే బిల్లు చేతికి వచ్చేందుకు కొన్నేళ్లు పడుతుంది. మరోపక్క రహదారితో పాటు డ్రెయిన్ పనులు ఒకేసారి చేస్తే ఎత్తు పల్లాల ఇబ్బందులు ఉండవు. అలా కాకపోయినా ఔట్‌లెట్ వరకు పనులు పూర్తి చేయించేలా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలి. కానీ తగిన ప్రణాళిక లేకుండా పనులు చేపడుతుండంతో రూ. లక్షలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాల వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోంది.

పూర్తి చేయిస్తాం

గతంలో నిలిచిన పనులను ఇప్పుడు పూర్తి చేయిస్తున్నాం. కొన్ని ప్రాంతాల్లో మురుగు సమస్య ఉండటంతో స్వచ్ఛతా హీ సేవతో పాటు పట్టణ సుందరీకరణలో భాగంగా డ్రెయిన్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం.
- పి.త్రినాథరావు, ఎంఈ

రైతులపై కక్ష సాధింపు సరికాదు: సీపీఎం

వీరవాసరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే గిట్టుబాటు ధర చట్టం చేయకుండా రైతులపై కక్ష సాధించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. సీపీఎం గ్రామ మహాసభను పార్టీ నాయకుడు తాళ్లూరి రాము అధ్యక్షతన శనివారం నవుడూరు గ్రామంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బి.బలరాం మాట్లాడుతూ పాలకుల విధానాల వల్లే నష్ట చిన్నకారు, కౌలు రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సామాన్య ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. నవుడూరులో తాగునీటి ట్యాంకును శుభ్రం చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేయాలన్నారు.



చూడచక్కగా కామాక్షి మార్గ్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో బుధవారం మార్కెట్ కూడలి వద్ద కామాక్షి మార్గ్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. ఇక్కడ కామాక్షి అమ్మవారి ఆలయం ఉండటంతో 'మన భీమవరంలో శ్రీకామాక్షమ్మ' పేరిట బోర్డును ఏర్పాటు చేసిన ఆ ప్రాంతాన్ని పచ్చని మొక్కలు, శివలింగాకృతులతో తీర్చిదిద్దారు. ఇక్కడ పలువురు స్వీయ చిత్రాలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.



పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

మత్స్యపురి (వీరవాసరం), న్యూస్‌టుడే: మత్స్యపురి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2012-13 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాల్య మిత్రులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఉపాధ్యాయులు లక్ష్మీరావు, గాదిరాజు కనకరాజులను సత్కరించారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

మహాదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే : ఉప్పరగూడెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు, సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ గుత్తుల కనక మహాలక్ష్మి, శివాలయ కమిటీ ఛైర్మన్ శివరామరాజు, తెదేపా గ్రామ అధ్యక్షుడు వనిమా శ్రీనివాస్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

పాలకోడేరు, న్యూస్‌టుడే: గత అయిదేళ్లలో పడకేసిన అభివృద్ధిని మళ్లీ పట్టాలెక్కిస్తామని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు తెలిపారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆయన, ఆదివారం విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ, పాలకోడేరు, వేండ్ర, గొల్లలకోడేరు గ్రామాల్లో సుమారు రూ.60 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, శివారు ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా తయారైన రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, తెదేపా సీనియర్ నాయకులు ఏడుకొండలరాజు, మురళీకృష్ణరాజు, కావూరు రాంబాబు, కమ్మిల రాంబాబు, గాదిరాజు సూర్యనారాయణరాజు, నడిపూడి అప్పారావు, చేబోలు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గొల్లలకోడేరులో రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఉండి, న్యూస్‌టుడే: ఉండి మండలం ఎన్నార్పీఅగ్రహారం, ఉండి పరిధి చిక్కాల వీరన్న నగర్‌లలో సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. నాణ్యత ప్రమాణాల మేరకు పనులు జరిపించాలని అధికారులను ఆదేశించారు. సర్పంచులు, సూరవరపు కనకదుర్గ, కమతం సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు కనుకు రమాదేవి, తెదేపా నాయకులు దూసనపూడి రాంబాబు, కిన్నెర వెంకన్న, కాగిత బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయం

కాళ్ల, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా అధిష్ఠానం నిర్ణయించిన వ్యక్తి విజయానికి అంతా సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు కోరారు. ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తెదేపా జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని గ్రామాల్లో 2021 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారిని ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పేరాబత్తుల రాజశేఖరం, జనసేన పీఏసీ సభ్యుడు వేగేశ్న కనకరాజుసూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పక్షంగా పీడీఎఫ్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పీడీఎఫ్ తరఫున పోటీ చేస్తున్న బొర్రా గోపీమూర్తి విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భీమవరంలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం జరిగిన పరిచయ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బి.సుభాషిణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) శాసనమండలిలో ప్రజా పక్షంగా పనిచేస్తుందన్నారు. సామాన్యులు, ఉద్యోగులు, చిరుద్యోగుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు.



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

భీమవరం సినిమా

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	వేట్టయన్
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	దేవర
కిషోర్ స్క్రీన్ 1	విశ్వం
కిషోర్ స్క్రీన్ 2	జిగ్రా
నటరాజ్	జనక అయితే గనక
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	వేట్టయన్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	శ్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	మార్టిన్
మహాలక్ష్మి స్క్రీన్ 2	మా నాన్న సూపర్ హీరో

జగన్మాతకు నీరాజనాలు

ఉండి, పాలకోడేరు, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఉండి మండలం చిలుకూరులో పైడమ్మ శోభాయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మార్గం పొడవునా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, పుష్పాలు సమర్పించి హారతులు ఇచ్చారు. ఉండి కొత్తపేట, కాపులపేటల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలపై అమ్మవారి ఊరేగింపులు నిర్వహించారు. ఆకివీడు పట్టణం, మండలంలో అన్ని గ్రామాల్లో, పాలకోడేరు మండలంలో డప్పువాయిద్యాలు, గరగ నృత్యాలతో బాణాసంచా కాలుస్తూ అమ్మవార్లను వైభవంగా ఊరేగించారు.

అజ్జమూరు (ఆకివీడు), న్యూస్‌టుడే: ఆకివీడు మండలం అజ్జమూరు గ్రామ దేవత అజ్జాలమ్మ జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్న సమారాధన చేశారు.



చిలుకూరులో పైడమ్మ



గొల్లలకోడేరులో..

వాసవీమాతకు పసుపు కొమ్ముల పూజ..

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరంలోని ఆర్యవైశ్య భవనంలో వాసవీమాత సన్నిధిలో పసుపు కొమ్ములతో పూజలు ఆదివారం నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అమ్మవారిని దర్శించి ఆశీస్సులు పొందారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు జూలూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి తటవర్తి బదిరీ, కోశాధికారి వబిలిశెట్టి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడు: అజ్జాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

అవి ఇవి అన్నీ

ధ్యాన సాధనతో ప్రశాంతత

వీరవాసరం, న్యూస్‌టుడే: ధ్యాన సాధనతో నాడీ శుద్ధి జరిగి జ్ఞాపక శక్తి పెరగడంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ గురువు ఎన్. అరుణశ్రీ అన్నారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో వీరవాసరంలోని సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత ధ్యాన్య శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆమె ధ్యాన సాధనతో కలిగే లాభాలను వివరించారు. సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవుడూరు (వీరవాసరం), న్యూస్‌టుడే: 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా నవుడూరులో పలు వీధుల్లో రూ. 30 లక్షల విలువైన సీసీ రహదారుల పనులకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సోమవారం శంకుస్థాపన చేస్తారని ఎంపీడీవో కె. కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోడపత్రాల ఆవిష్కరణ


భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సినీ కథానాయకుడు ప్రభాస్ పుట్టినరోజు వేడుకను ఈ నెల 23న ఘనంగా నిర్వహించేందుకు ఆయన అభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు నిర్వహించే రెబల్ స్టార్స్ సెలబ్రెటీ షో, సేవా కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రాలను ఎమ్మెల్యే పి.రామాంజనేయులు ఆదివారం ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించండి

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులో రహదారులు, తాగునీరు తదితర సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శాంతినగర్ ప్రాంతంలో సీపీఎం మూడో శాఖ మహాసభను ఆదివారం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. నాయకులు బి.రాంబాబు, లింగాల బలరాం, కె.గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్షలు పోసినా.. నిరుపయోగమే!

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని పార్కు స్థలంలో 2005 నుంచి ప్రతి నాలుగైదు ఏళ్లకోసారి ఏదోఒక అభివృద్ధి పని చేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు రూ. 25 లక్షలు వెచ్చించినా దానిని వినియోగంలోకి తేలేదు. ఇక్కడ రూ.5 లక్షలతో రక్షణ గోడ నిర్మించారు. ఇదే ప్రాంగణంలో చిన్నారులు ఆడుకునేందుకు రూ. 2.5 లక్షలతో జారుడు బల్లలు, ఊయల, వ్యాయామ పరికరాలు బిగించారు. మరికొన్నేళ్లకు రూ.10 లక్షలతో ట్రాఫిక్ పార్కు నిర్మించారు. పల్లంగా ఉన్నచోట నల్లకంకరతో పనులు చేసి నిర్వహణను గాలికొదిలేశారు. మళ్లీ ఇక్కడే వ్యాయామ పరికరాలు బిగించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. కానీ ఇక్కడ డ్రెయిన్ సక్రమంగా లేదు. దీంతో ఈ ప్రాంగణం వానాకాలంలో నీరు నిలిచి గడ్డి, పొదలు పెరిగిపోతున్నాయి. వ్యాయామ పరికరాలు తుప్పుపట్టాయి. 'ఈనాడు' ఇటీవల నిర్వహించిన 'డయల్ యువర్ కమిషనర్'కు ఈ సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేశారు. పార్కును పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తామని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి చెప్పారు.



పార్కు ఆవరణ ఇలా..



అవరోధాలతో కలవరం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలంలో కీలకమైన చినకాపవరం మురుగు కాలువలో కోళ్లపర్రు వంతెన వద్ద ఇలా గుర్రపుడెక్క, తూడు పేరుకుపోయాయి. గుమ్ములూరు నుంచి దుంపగడప వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర ఈ కాలువలో పలు చోట్ల ఇదే పరిస్థితి. గత నెల తొలివారంలో కొల్లేరు వరద కారణంగా ఈ కాలువ ఉగ్రరూపం దాల్చింది. దీంతో ముంపుబారిన పడిన వరిచేలల్లో నీరు ఇటీవలే తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం దఫదఫాలుగా వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతారణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి ముంపు ముప్పు తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ వెంబడి గుమ్ములూరు, కోళ్లపర్రు, ఆకివీడు, దుంపగడప తదితర గ్రామాల పరిధిలో వంతెనలు తాకుతూ భారీగా తూడు, గుర్రపుడెక్క మేటవేసి ఉంది. ఈ సమస్యను ఇన్‌ఛార్జి ఏఈ ఫణిశంకర్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

రహదారి ప్రమాదంలో మహిళ మృతి

కాళ్ల (భీమవరం పట్టణం), బొబ్బిలి, న్యూస్‌టుడే: కాళ్ల గ్రామంలో ఈ నెల 12న జరిగిన రహదారి ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన రౌతు వరలక్ష్మి (59) కంటి చికిత్స నిమిత్తం తన కుమారులతో కలిసి కారులో ములుగు నుంచి భీమవరం వెళ్తుండగా.. కాళ్ల గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో వరలక్ష్మి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. కుమారులు రామకృష్ణనాయుడు, గణపతినాయుడు గాయపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్.శ్రీనివాసరావు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు రైల్వేస్టేషన్ రోడ్డులోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక చేపల వ్యాపారి షేక్ అజ్మీర్‌బాబా అమెరికాలోని తన కుమార్తె వద్దకు ఈ నెల 5న బయలుదేరి వెళ్లారు. ఆయన బంధువులు ఆదివారం సాయంత్రం వెళ్లి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాతో పాటు పలు గదుల్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. భారీగా బంగారు ఆభరణాలు, నగదు చోరీ అయినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళ మెడలో గొలుసు..

యనమదుర్రు(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం యనమదుర్రు గ్రామ పరిధిలో ఈ నెల 11న రాత్రి ఓ మహిళ మెడలో బంగారం గొలుసును గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చోరీ చేశారు. స్టేషన్ రైటర్ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మజ్జి ఆదినారాయణ తన భార్యతో కలిసి భీమవరంలో ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెంబడించారు. ఈ క్రమంలో మహిళ మెడలోని నాలుగు కాసుల బంగారం గొలుసు లాక్కొని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం స్వాధీనం

పాలకోడేరు, న్యూస్‌టుడే: పెన్నాడలో అక్రమంగా నిల్వ చేసిన 26 మద్యం సీసాలను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు పాలకోడేరు ఎస్సై ఎం.రవివర్మ తెలిపారు. దీనిపై స్థానికుడు సిర్రా బాలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం రెండో పట్టణంలోని ఓ భవనంలో జూదాలాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు సీఐ జి.కాళీచరణ్ ఆదివారం చెప్పారు. వారి నుంచి రూ.37,150 స్వాధీనం చేసుకున్నామన్నారు.

అనాకోడేరు(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం అనాకోడేరులో కోడి పందేల స్థావరంపై దాడి చేసి ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వారి నుండి రూ. 17,790 నగదు, కోడి పుంజు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని భీమవరం రెండోపట్టణ సీఐ జి.కాళీచరణ్ పేర్కొన్నారు. పట్టణంలో రౌడీషీటర్లు, పాతనేరస్థులకు కౌన్సెలింగ్‌ను స్టేషన్ ఆవరణలో ఆదివారం ఇచ్చారు.











(c) eenadu

నరసాపురం

● నరసాపురం ● పాలకొల్లు ● ఆచంట

అసంపూర్తి భవనాలతో అవస్థలు



పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ములపర్రులో అంగన్‌వాడీ భవనం నిరుపయోగంగా ఉండటంతో చిన్నారులు అద్దె భవనంలో మగ్గిపోతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ భవనానికి నిధులు కేటాయించకపోవడంతో పనులు పూర్తి కాకుండానే శిథిలావస్థకు చేరింది. పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు రూత్‌కుమారి మాట్లాడుతూ అసంపూర్తి భవనాలపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

తీరంలో పర్యాటకుల సందడి



మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్, కేపీపాలెంసౌత్‌లలోని బీచ్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవుల ఆఖరి రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆహ్లాదంగా గడిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై జి.వాసు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సన్నద్ధం



జలవనరుల శాఖ డీఈఈ వెంకట నారాయణ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవుతున్నట్లు జలవనరులశాఖ డీఈఈ సీహెచ్ వెంకట నారాయణ తెలిపారు. డివిజన్ పరిధిలో సాగునీటి సంఘాలు 36, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 5 ఉన్నాయన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు నిర్దేశించిన సంఘాల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులను ఎన్నుకుంటారన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల వారీగా సాగునీటి సంఘాల వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరు మండలం 6, పాలకొల్లు మండలం 8, మార్టేరు పరిధిలో 6, పెరవలి పరిధిలో 8, సిద్ధాంతం పరిధిలో 8 సంఘాలున్నాయి. నరసాపురం, పాలకొల్లు, మార్టేరు, పెరవలి, సిద్ధాంతం డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయన్నారు. వీటి ఎన్నిక ప్రక్రియ ఈ నెల 16న ప్రారంభమై 24తో ముగుస్తుందన్నారు.

బీమా.. రైతులకు ధీమా

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడి జీవించే కుటుంబాలు ఎక్కువగానే ఉన్నాయి. కానీ పాడి పశువులు ప్రమాదవశాత్తు లేదా జబ్బు చేసి మరణిస్తే రైతు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో వారిని ఆదుకోవడానికి తెదేపా ప్రభుత్వం అమలు చేసిన పశు నష్టపరిహార పథకానికి గత వైకాపా ప్రభుత్వం మూడేళ్లలోనే మంగళం పలికింది. అనంతరం వైఎస్సార్ బీమా పథకాన్ని తెచ్చి రైతుల నెత్తిమీద ప్రీమియం భారాన్ని మోపింది. ఎంతోమంది రైతులకు బకాయిలు చెల్లించపోవడంతో పోషకులు తీవ్రంగా నష్టపోయారు. నియోజకవర్గంలో 60 కేసుల్లో



సుమారు రూ.16 లక్షలకు పైగా పరిహారం చెల్లించలేదు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. తాజాగా కూటమి ప్రభుత్వం పశుబీమా పథకాన్ని ఆచరణలోకి తీసుకొచ్చేందుకు విధివిధానాలను సిద్ధం చేసింది.


మార్గదర్శకాలు

బీమా చేయించేందుకు బ్యాంక్ పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఎస్సీ, ఎస్టీ వర్గీయులైతే తెల్లరేషన్ కార్డు అందించాలి. పాడిపశువులకు బీమా చేసే క్రమంలో వాటికి ట్యాగ్ వేస్తారు. పశువు మరణించిన వెంటనే సమీపంలో పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. పశువును విక్రయిస్తే 7 రోజుల్లోగా బీమా కంపెనీకి సమాచారం ఇచ్చి పేరు మార్చుకోవాల్సి ఉంటుంది. దేశవాళీ, సంకర జాతి పశువులకు 3 సంవత్సరాలకు రూ.30 వేలు, నాటుజాతికి చెందిన పశువులకు 3 సంవత్సరాలకు రూ.15 వేలు, గొర్రె, మేక, పంది రూ.6 వేల వరకు బీమా వర్తిస్తుంది. దీనికి రైతు ప్రీమియం వాటా చెల్లించాల్సి ఉంటుంది.

నియోజకవర్గంలో పశువుల వివరాలు

జీవాలు	సంఖ్య
గేదెలు	8611
ఆవులు	3738
గొర్రెలు	3203
మేకలు	1934

అవగాహన కల్పిస్తున్నాం



ప్రతి రైతుకు లబ్ధి చేకూర్చేందుకు రైతులను చైతన్యం చేసి నిబంధనల ప్రకారం ప్రీమియం చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నాం. **- జి.మల్లేశ్వరరావు, పాలకొల్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు**

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట : 91212 29087

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక 15వ వార్డు త్సవటపల్లివారి వీధిలో కొంతకాలంగా డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదు. దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంటుంది. **- సూర్య, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- దావీదురాజు, పారిశుద్ధ్య అధికారి**

పాదుల తొలగింపు

స్పందనకు వందనం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: దగ్గులూరు మసీదు వద్ద విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుపోయాయని స్థానికులు 'ఈనాడు' నిర్వహిస్తున్న 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా ఈ నెల 11న ప్రచురితమైంది. దీనిపై పాలకొల్లు గ్రామీణ ఏఈ శ్రీనివాస్ స్పందించి అల్లుకున్న పాదులను సిబ్బందితో తొలగింపజేశారు.

ప్రతి ఎన్నికలో మెజార్టీ సాధించాలి: మంత్రి



మాట్లాడుతున్న నిమ్మల

పాలకొల్లు, మార్కెట్, న్యూస్‌టుడే: ప్రజారంజక పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రతి ఎన్నికలో మెజార్టీ సాధించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం స్థానిక క్లాత్‌మర్చంట్ భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రతి మండలంలోనూ పట్టభద్రుల ఓట్ల జాబితాను సిద్ధం చేసి అందరికీ ఓటు హక్కు నమోదు చేయించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, శాసనమండలి సభ్యుడు వేపాడ చిరంజీవి, ఏపీఐఐసీ కార్పొరేషన్ ఛైర్మన్ మంతెన రామరాజును మంత్రి సత్కరించారు. ● జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వారి 11వ నూతన శాఖను స్థానిక తపాలా కార్యాలయం పక్కన ఆదివారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 98 సంవత్సరాల కిందట ప్రారంభించిన ఈ బ్యాంక్ రాజమహేంద్రవరంలోని చేనేత కార్మికులు, సామాన్య ప్రజానీకానికి విశిష్ట సేవలు అందించిందన్నారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారి కె.వెంకటేశ్వరరావు, బ్యాంక్ ఛైర్మన్ బొమ్మన జయకుమార్, వైస్‌ఛైర్మన్ రొబ్బి విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువ శాస్త్రవేత్త సత్కారం



సత్కరిస్తున్న ఆర్డీవో రాజు

నరసాపురం, న్యూస్‌టుడే: అంతరిక్ష పరిశోధ నారంగ శాస్త్రవేత్తగా ఎంపికైన చొప్పల బిందుజను ఆర్డీవో దాసి రాజు శనివారం సత్కరించారు. నరసాపురానికి చెందిన బిందుజ తండ్రి జగదీష్ ఎల్‌బీచర్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు. తల్లి శాంతిసుధ మంగళగుంటపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. బిందుజ కేరళ ఐఐఎస్టీలో ఇంజినీరింగ్ (ఈసీఈ ఏవియానిక్స్) పూర్తిచేశారు. తిరువనంతపురం ఇస్రో శాస్త్రవేత్తగా ఎంపికైన విషయం తెలుసుకున్న ఆర్డీవో బిందుజను తన కార్యాలయానికి ఆహ్వానించి సన్మానించారు. శాస్త్రవేత్తగా దేశానికి ఉత్తమ సేవలు అందించి ఈ ప్రాంతానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

అస్తవ్యస్తంగా పంచాయతీ పాలన

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పొలమూరు గ్రామ పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా మారిందని, కనీసం వీధి దీపాలు ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో పరిపాలన సాగుతోందని సీపీఎం జిల్లా నాయకులు కేతా గోపాలన్ ఆరోపించారు. సీపీఎం పొలమూరు గ్రామశాఖ మహాసభ ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలమూరు-చెన్నాడచెరువు రహదారిని అభివృద్ధి పరచాలని, దళిత శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. నూతన శాఖ కార్యదర్శిగా రాపాక ఆశీర్వాదాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సుబ్బరాజు, ఎన్.చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై నమ్మకంతోనే చేరిక



పార్టీలో చేరిన వారితో జనసేన నాయకులు

మొగల్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్న ప్రభుత్వంపై నమ్మకంతో ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు కూటమి పార్టీల్లో చేరుతున్నారని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. మొగల్తూరుకు చెందిన వైకాపా నాయకుడు ఉపసర్పంచి బోణం నరసింహారావు, వైస్‌ఎంపీపీ కైలా సుబ్బారావు, దూసనపూడి దొరబాబు వారి అనుచరులతో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం జనసేన మండలశాఖ అధ్యక్షుడు కొల్లాటి గోపి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కలువకొలను తాతాజీ, చల్లా దానయ్యనాయుడు, మేడిద బాబ్జి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శుద్ధిజల కేంద్రం ప్రారంభం..

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన శుద్ధి జల కేంద్రాన్ని దాత కుటుంబ సభ్యులతో కలిసి ఆర్డీవో దాసి రాజు, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ శనివారం ప్రారంభించారు. తణుకుకు చెందిన ప్రవాసాంధ్రుడు నరహరిశెట్టి సాయిదుర్గాగణేష్ రూ.1.20 లక్షల ఆర్థిక సహకారంతో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసి రాజు, రోటరీ క్లబ్ నరసాపురం శాఖ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి, ఆసుపత్రి పర్యవేక్షకురాలు సుప్రియ పాల్గొన్నారు.

ఘనంగా అక్షరోత్సవం

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం వైఎన్‌సీలో శనివారం పేరాల రామలింగేశ్వరరావు శతజయంతి అక్షరోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరరావు రచించిన శ్రీకృష్ణ కల్యాణ కింకిణి అను రుక్మిణీ కల్యాణ పద్య కావ్యాన్ని ముఖ్య అతిథులు ఆర్డీవో దాసి రాజు, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తన తండ్రి రామలింగేశ్వరరావు పేరున అక్షరోత్సవం ఏర్పాటుచేసిన మోహన్‌ను అభినందించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ ఎం.అంజయ్య, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు, చక్రావధానుల రెడ్డప్ప ధవేజీ, పేరాల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గోగులమ్మకు వెండి హారం సమర్పణ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: యర్రంశెట్టిపాలెంలో కొలువైన గోగులమ్మవారికి భక్తులు శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సుమారు రూ.80 వేల విలువ చేసే వెండి హారాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వెండి హారంతో అలంకరించారు.


పాడి పశువులతో ఆదాయం



పాలకేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ చేయాలని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ సూచించారు. పాలకొల్లు మండలం కాపవరంలో రైతువారి పాలకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి వరి పండించినా నష్టాలు చవిచూస్తున్న రైతులు రెండు పాడి పశువులు పెంచడం ద్వారా నిత్యం ఆదాయం పొందవచ్చున్నారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకుడు కసుకుర్తి రమాకాంత్, తెదేపా నాయకులు సర్వేశ్వరరావు, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం



క్షీరారామంలో రాజరాజేశ్వరిదేవిగా



వాసవీశాంతిధాంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



మొగల్తూరు: వడయార్‌పేటలో..

పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు, ఆచంట, నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఆచంట, నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో సందడి నెలకొంది. పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిజరూప దర్శనం అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి, మహిషాసురమర్దని అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీశాంతిధాంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు దర్బార్ రాజకుమారీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నెగ్గిపూడి, చినమల్లం శివారు మదనవారిపాలెంలో మహిళలు బోనాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. పెనుగొండలో వేంద్ర, పిల్లి తదితర వీధులు, మార్టేరులో అమ్మవార్లను, పలు ఆలయాలను సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేంద్ర వారి వీధి పెదరామాలయానికి పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని, వేదవ్యాసశాస్త్రి దంపతులు రూ.30 వేల విలువైన వెండి శఠగోపం అందజేశారు. ● పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో దుర్గమ్మ రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. మంత్రి నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.



ఏనుగుల సంబరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఏనుగు సంబరాలు

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ మండలంలో శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా పలు వీధుల్లో అమ్మవారి ఉత్సవ నిర్వాహకులు ఏనుగు సంబరాలు చేశారు. పెనుగొండ వేంద్ర వారి వీధిలో ఏనుగుల సంబరాన్ని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ సంఘాల ఆధ్వర్యంలో మేళతాళాలతో అమ్మవార్ల ప్రతిమలను వివిధ వాహనాలపై ఊరేగించి కాలువలో నిమజ్జనం చేశారు.

పట్టభద్రులను ఓటర్లు చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామరాజు

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించేందుకు కృషిచేయాలని ఏపీఐఐసీ ఛైర్మన్, తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు కూటమి శ్రేణులకు సూచించారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఓటు నమోదుపై పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యశాలకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఓట్ల నమోదుకు చేపట్టాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు చిరంజీవి, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర ఎస్సైగా స్వామి

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్ర ఎస్సైగా కె.స్వామి నియమితులయ్యారు. ఆయన ఏలూరు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు.

సమస్యలపై నిరంతర పోరాటం

ఆచంట, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పరితపిస్తూ వాటిపై పోరాడిన వ్యక్తి ప్రసాద్ అని పలువురు నాయకులు అన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు వెన్నపు ప్రసాద్ సంతాప సభ ఆచంట వేమవరంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డి.రాజగోపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఖాతాదారుల సేవలో 11 సంవత్సరములు పూర్తి చేసుకున్న శుభసందర్భంలో మా ఖాతాదారులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు.



మా వద్ద: ఆయిల్సు, గ్రీజులు, వాటర్ డిస్కౌంట్‌పై లభించును.
T.H.R. ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంక్)
డీలర్స్: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్
గటాల దిబ్బ, సిద్ధాంతం, ప.గో.జిల్లా
ఫోన్: 08819 – 293295, సెల్: 98495 73261

ప్రమాదకరంగా జాతీయ రహదారి



అంబేడ్కర్ కూడలి వద్ద గుంతలు ఇలా..

రుస్తుంబాద (నరసాపురం), న్యూస్‌టుడే: జిల్లాలోని 216 జాతీయ రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. చించినాడ నుంచి లోసరి వరకు సుమారు 42 కిలోమీటర్ల మేర ఉన్న జాతీయ రహదారి పలుచోట్ల అధ్వానంగా మారి అంతర్గత రహదారులను తలపిస్తోంది. నిర్వహణలో భాగంగా మరమ్మతులు చేసినా వారం లోపే దెబ్బతింటోంది. జాతీయ రహదారిపై వాహనాలు 80 కి.మీ., ఆపై వేగంతో ప్రయాణిస్తుంటాయి. ద్విచక్ర వాహన చోదకులు తరచూ ఆ గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. 'న్యూస్‌టుడే' ఈ సమస్యను జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ మచిలీపట్నం ప్రాజెక్టు ఏఈ వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి మరమ్మతులకు చర్యలు చేపడతానన్నారు.

చతుర్థ వర్ధంతి



శ్రీ అడబాల శ్రీమన్నారాయణమూర్తి గారు, B.Sc, B.Ed
జననం: 17-04-1941
మరణం: 14-10-2020
ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాలకొల్లు
వ్యవస్థాపకులు: అడబాల గ్రూప్స్
ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని అణువణువునా నింపుకొని జీవించినంత కాలం పదిమందికి ఆదర్శప్రాయంగా నిలిచి క్రమశిక్షణతో పరిపూర్ణ జీవితాన్ని అనుభవించి, కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, శాంతిధామంలో శాశ్వత నివాసం ఏర్పరచుకున్న శ్రీ అడబాల శ్రీమన్నారాయణమూర్తి గారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ.. మీరు భౌతికంగా మా నుండి దూరమైనా, మీ జ్ఞాపకాలు సదా చిరస్మరణీయం. మీ ఆశయ సాధనకై మేము ఎల్లప్పుడూ కృషి చేస్తాము.
భార్య: అడబాల తులసిరత్నం
కుమారుడు: అడబాల వెంకటరమణ కోడలు: వాణిశ్రీ
కుమార్తె: కొంపెర్ల ఇందిరాదేవి అల్లుడు: శివరామకృష్ణారావు
మనుమలు: నాగసాయి మణికంఠ రోహిత్ - దివ్యసాయి శ్వేత, హిమసాయి హర్షిత్, సాయి మణికంఠ సిద్ధార్థ్, ఆద్య నాగ సంహిత
అడబాల గ్రూప్స్ సిబ్బంది
అడబాల థియేటర్స్ పాలకొల్లు
అడబాల గార్డెన్స్ పాలకొల్లు
A.కంఫర్ట్ హోటల్ పాలకొల్లు
అడబాల ఫిల్లింగ్ స్టేషన్ పాలకొల్లు
A.సెలబ్రేషన్స్ పాలకొల్లు
ADABALA CONSTRUCTIONS BUILD YOUR DREAMS

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

వృద్ధులకు వైద్య పరీక్షలు



తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా మంచానికే పరిమితమైన వారికి ఉచిత వైద్య సేవలందించారు. నేత్ర వైద్యులు హుస్సేన్ అహ్మద్, ఎండీ సుంకవల్లి నీలు మహేంద్ర సజ్జాపురం ప్రాంతంలో పర్యటించారు. ఇంటింటి వైద్య కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తూ భోగవల్లి నాగమల్లేశ్వరి రూ.10 వేలు విరాళం అందజేశారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు కరుణాకర్ చౌదరి, సభ్యులు నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	:79950 67078
పెంటపాడు	:79939 36123
తణుకు గ్రామీణ	:85558 50851
అత్తిలి	:91548 46774

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే

సమస్య: పట్టణంలోని యాగర్లపల్లిలో కుక్కల సంచారం అధికంగా ఉంది. పాదచారులు, వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయి. **- ప్రభాకర్, స్థానికుడు**
సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- ఏసుబాబు, కమిషనర్**

సమస్య: స్థానిక మహాత్మా గాంధీ సమీపంలో డ్రైనేజీపై కల్వర్టులు ధ్వంసమయ్యాయి. రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. **- సత్యనారాయణ, స్థానికుడు**
సమాధానం: కల్వర్టులకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. **- ఏసుబాబు, కమిషనర్**

సమస్య: హౌసింగ్‌బోర్డు శివారు వీధిలో మంచినీరు సరిగ్గా రావడం లేదు. కుళాయిల నుంచి మురికి నీరు వస్తుండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. **- దీపక్, స్థానికుడు**
సమాధానం: తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపడతాం. **- ఏసుబాబు, కమిషనర్**

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

సమస్య: యాగర్లపల్లి కాలనీలోని ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరి దోమలు విజృంభిస్తున్నాయి. **- రమణ, స్థానికుడు**
సమాధానం : దోమల నియంత్రణకు చర్యలు చేపడతాం. **- ఏసుబాబు, పురపాలక కమిషనర్**

సమస్య: మహాలక్ష్మి నగర్‌లోని నాలుగో రోడ్డు శివారులో పందుల సంచారంతో పరిసరాలు కాలుష్యం అవుతున్నాయి **- ప్రకాశ్, స్థానికుడు**
సమాధానం : పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. **- శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పెంటపాడు, న్యూస్‌టుడే :

సమస్య : పెంటపాడు మండలం పడమరవిప్పర్రులోని సుకాలదిబ్బ, ఉప్పరగూడెం ప్రాంతాల్లో ప్రధాన మురుగుకాలువ పలు చోట్ల పూడిపోయింది. **- కృష్ణ, స్థానికుడు**
సమాధానం : డ్రెయిన్‌ను బాగు చేయిస్తాం. **- శోభన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : పెంటపాడు బీసీ కాలనీలోని పలు వీధుల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. **- రాజు, స్థానికుడు**
సమాధానం : చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. **- బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

కుంగుతున్న కాలువ గట్లు.. రైతులకు తప్పని పాట్లు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

తాడేపల్లిగూడెం మండలం దుఃఖదాయినిగా పేరుగాంచిన ఎర్రకాలువ పేరువింటేనే చాలు పరీవాహక గ్రామాల రైతులు హడలిపోతున్నారు. కొంగువారి గూడెంలో ప్రారంభమైన ఎర్రకాలువ దువ్వ వరకు ఎర్రకాలువగా, అక్కడ నుంచి భీమవరం వరకు యనమదుర్రు డ్రెయిన్‌గా, తర్వాత బంగాళాఖాతంలో కలిసేంత వరకు ఉప్పుటేరుగా పయనం సాగిస్తోంది. పేరు ఏదైనా వర్షాకాలంలో అది సృష్టించే ప్రళయం అంతా ఇంతా కాదు. ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చడంతో వేలాది ఎకరాల వరిపొలాలు నీట మునిగి రైతులకు అపార నష్టం మిగిలిస్తోంది. దీనికి ప్రధాన కారణం ఏటిగట్లు బలహీనత. ప్రభుత్వాలు మారుతున్నా పరీవాహక ప్రాంతాల రైతుల తలరాత మాత్రం మారడం లేదు.


వీరంపాలెం వద్ద గండి (పాతచిత్రం)

మునుపెన్నడూ లేని విధంగా..



ఈ సంవత్సరం వచ్చిన వరదలకు మునుపెన్నడూ లేని విధంగా రైతులు నష్టపోయారు. నాయకులు హామీలు ఇవ్వడం, అధికారులు వాటిని విస్మరించడం పరిపాటిగా మారింది. **- చెట్ల మురళి, రైతు, పట్టెంపాలెం.**

గట్లు పటిష్ఠ పరచాలి



గట్లు బలహీనపడటంతో నీరు పొలాల్లోకి చేరి పంటనష్టం వాటిల్లుతోంది. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంతో తీవ్రత పెరుగుతోంది. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. **- అంగిన చంద్రరావు, రైతు, వీరంపాలెం**


పట్టెంపాలెం వద్ద

ఎగువన వర్షాలకు వరదలు

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే చాలు కాలువ ఉద్ధృతి పెరిగి గట్టు కోతకు గురై గండ్లు పడటం పరిపాటిగా మారింది. 2018 వరదలకు వీరంపాలెం వద్ద వంతెన, 2020లో మాధవరం కంసాలి పాలెం వంతెన కొట్టుకు పోయాయి. ఈ సమస్య పరిష్కారానికి గత వైకాపా ప్రభుత్వం హామీ ఇచ్చినా ఆ మాట నీటిమూటగానే మిగిలింది. దీంతో రైతుల కష్టాలు యథావిధిగా మారాయి.

వందకు పైగా గండ్లు

బంగారుగూడెం నుంచి గూడెం మండలం శివారు ఆరుళ్ల వరకు కాలువకు ఇరువైపులా సుమారు వందకు పైగా గండ్లు పడ్డాయి. దీంతో వరద నీరు పంటపొలాలపై పడి నష్టం వాటిల్లుతోంది. ఈ సంవత్సరం తాడేపల్లిగూడెం మండలంలో సుమారు 11 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం

తాడేపల్లిగూడెం మండలంలోని ఎర్రకాలువ గట్ల పటిష్ఠానికి చర్యలు తీసుకుంటాం. రైతుల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేసి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తాం. **- అనిల్, ఎర్రకాలువ ఏఈ**

మానవత్వం చాటుకున్న పోలీసులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పెద తాడేపల్లి శివారు పోశమ్మనగర్ వెనుక పొలాల్లో ఓ వృద్ధుడు కొనఊపిరిలో ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో అతడికి సపర్యలు చేసి, ఆసుపత్రిలో చేర్చి మానవత్వం చాటుకున్నారు. ప్రస్తుతం అతను వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వితంతువులకు చేయూత

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఏ లిటిల్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వితంతువులకు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు చోళ్ల నందకిషోర్ బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే : పడాలలో అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో స్వాములకు ఉచిత భిక్ష ఆదివారం కొవ్వూరి గాంధీ రెడ్డి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ప్రారంభించారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు నిమ్మల బాబ్జీ, కార్యదర్శి సత్యనారాయణ, సభ్యులు మునగాల జితేంద్ర, ఏవీ రామరాజు అయ్యప్ప మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

రాట్నాలకుంట(పెదవేగి), న్యూస్‌టుడే: రాట్నాలకుంటలో వెలసిన రాట్నాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజ ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.44,845 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీశ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: దాతల చేయూతను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విద్యార్థులకు సూచించారు. శనివారం వేల్పూరులో శ్రీవిద్యానిధి వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వేల్పూరు మాజీ సర్పంచి పెనుమర్తి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వేల్పూరు ఉన్నత పాఠశాలలో చదివిన మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందించడం అభినందనీయమన్నారు.


విద్యార్థులతో ఎమ్మెల్యే రాధాకృష్ణ, తదితరులు

గొడుగుల వితరణ... తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ట్రెజరర్ యండపల్లి సత్య తులసి భర్త యండపల్లి శ్రీనివాస్ జ్ఞాపకార్థం ఆదివారం జోన్ ఛైర్‌పర్సన్ లయన్ చిట్టూరి సుజాత చేతుల మీదుగా వీధివ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు బంటుపల్లి శేషారావు, కార్యదర్శి సుంకవల్లి చిరంజీవి కుమారి, వావిలాల సరళాదేవి పాల్గొన్నారు.

ముగిసిన దసరా ఉత్సవాలు


అలంకరణలో మండపాక యల్లారమ్మ


రాజరాజేశ్వరిగా వాసవీమాత


అత్తిలి విజయచాముండేశ్వరి

తణుకు గ్రామీణం, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాలు శనివారం పట్టణ, గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. మండపాక యల్లారమ్మ , తణుకులోని వాసవీమాతను ప్రత్యేకంగా అలంకరించారు. ★ దువ్వలో దానేశ్వరి ఆలయంలో మహోత్సవాలు వైభవంగా జరిగాయి. తెప్పోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. ★ అత్తిలి మండలంలో ఆదివారంతో విజయదశమి వేడుకలు ఘనంగా ముగిశాయి. అత్తిలి పెద్ద వంతెన వద్ద కొలువైన చాముండేశ్వరికి జలాభిషేకం నిర్వహించారు.

తాడేపల్లిగూడెం అర్బన్, వన్‌టౌన్, పెంటపాడు, న్యూస్‌టుడే : పెంటపాడు మండలం ప్రత్తిపాడు వైకూడలిలోని శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు. ★ వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో 108 వెండి కలశములతో పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్టుకు పంచామృతాలు, ఫల రసాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేపట్టారు. ★ శ్రీదేవి మహంకాళమ్మ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ద్వారకాతిరుమల మండలం సంద్రగుంటకు చెందిన పెనుమాల పండు, మేరీ దంపతులు తమ కుమారుడు అక్షయ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఉంగుటూరు మండలం అప్పారావుపేటలో ఓ శుభకార్యానికి బయల్దేరారు. మార్గం మధ్యలోని చేబ్రోలు వద్ద ద్విచక్ర వాహనాన్ని నూజివీడు నుంచి పెదతాడేపల్లి వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో మేరీకి తీవ్ర, పండు, అక్షయ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

బ్రహ్మోత్సవాల్లో తణుకు కోలాట బృందం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: దాస సాహితీ ప్రాజెక్టు తితిదేలో నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో తణుకులోని రామకృష్ణ సేవా సమితి కోలాటం సభ్యులు ఆలపాటి లక్ష్మి, ధనలక్ష్మి, సుందరనిడి కళా, గురువు తిరుపతిరావు పాల్గొన్నారు. అదనపు ఈవో చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి భార్య పల్లవి, సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర బృందాన్ని అభినందించారు.



బైబిల్ క్విజ్ పోటీలు

పెంటపాడు, న్యూస్‌టుడే : పెంటపాడు ఎస్సీ కాలనీలోని లూథరన్ ప్రార్థనా మందిరంలో శనివారం గురు మండల అధ్యక్షుడు సునీల్ కుమార్ అధ్యక్షతన స్త్రీల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సునీల్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మండలంలోని పలు లూథరన్ సంఘాల నుంచి ర్యాలీలో పాల్గొన్న మహిళలకు బైబిల్ క్విజ్‌పోటీలు నిర్వహించారు. పెంటపాడు సంఘం ప్రథమస్థానంలో గెలుపొందడంతో వారికి ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. అనంతరం పాస్టర్ సునీల్‌కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు.



ఉద్యానం... అధ్వానం..

అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి బస్టాండు కూడలిలో ఆహ్లాదం కోసం కాలువకు ఆనుకొని నిర్మించిన ఉద్యానం అధ్వానంగా మారింది. దేశ నాయకులు, కవులు, మహర్షుల విగ్రహాలను ఇక్కడ కొలువుదీర్చి, ప్రహరి నిర్మించారు. అయిదేళ్ల కాలంలో వైకాపా పాలకులు పట్టించుకోక పోవడంతో ఉద్యానం చెత్తా చెదారంతో నిండిపోయింది. పారిశుద్ధ్య చర్యలు చేపడతామని కార్యదర్శి భాస్కర్ తెలిపారు.

మలుపులు.. ప్రమాదాలకు హేతువులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెంలోని పలు రహదారుల్లో ప్రమాదకరమైన మలుపులు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. మలుపుల వద్ద చోదకులు అవతలి వాహనాలను గమనించలేక ప్రమాదాలబారిన పడుతున్నారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, సూచికలు ఎక్కడా కానరాకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిలో కొందరు మృత్యువాత పడుతుంటే మరి కొందరు తీవ్రంగా గాయపడుతున్నారు. ఈ విషయమై ట్రాఫిక్ ఎస్సై కొండలరావు మాట్లాడుతూ ప్రమాద సూచికలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

పట్టణంలో ప్రమాదకర మలుపులు:	18
గత అయిదేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాలు	69
మృతులు	11
క్షతగాత్రులు	41
ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డులు	0


వంతెన వద్ద

★ పట్టణంలోని భీమవరం, తణుకు, ఏలూరు, కేఎన్, కడకట్ల, పడాల రహదారులతో పాటు రెండు పైవంతెనలపై ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయి. మలుపులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. కడకట్ల నుంచి హౌసింగ్ బోర్డు, కడకట్ల నుంచి పడాల వెళ్లే వంతెన, పోలీస్ ఐలాండ్ నుంచి పెంటపాడు వెళ్లే మార్గాల్లో అధికశాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించే అవకాశం ఉంది. కానీ యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. వీటికి తోడు రహదారులు సైతం అధ్వానంగా ఉండటంతో వాహనదారుల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి.

బస్సు ఢీకొని

తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారం గ్రామానికి చెందిన బి.సాయి తాపీ పని చేస్తుంటారు. నెల కిందట కూలి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై పట్టణం వచ్చిన ఈ యువకుడు యాగర్లపల్లి నుంచి కడకట్ల వంతెనపైకి మలుపు తిరుగుతుండగా ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతని కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రాణాలతో బయటపడ్డారు

ఏడాది కిందట ఇద్దరు మహిళలు ద్విచక్ర వాహనంపై హౌసింగ్ బోర్డు నుంచి కడకట్ల ఇటుకల బట్టీకి వెళ్తున్నారు. వంతెనపై మలుపు తిప్పుతుండగా అటుగా వెళ్తున్న ఓ లారీ వీరిమీదకు దూసుకొచ్చింది. ఈ ఘటనలో మహిళలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేరండి: ఎస్పీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికెళ్లి స్వస్థలాలకు తిరుగు పయనమవుతున్న భక్తులకు కలపర్రు టోల్ ప్లాజా వద్ద ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, పోలీసు సిబ్బంది ఆదివారం రాత్రి అల్పాహారం, పండ్లు, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ... భక్తులు రోడ్డు పక్కన సర్వీసు రోడ్డులో జాగ్రత్తగా నడవాలని సూచించారు. వాహనాల రాకపోకలను గమనించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి



ప్రేమ, ఆప్యాయతలతో మమ్మలను పెంచి మా కుటుంబ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి మా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన శ్రీ సత్తి వెంకటరెడ్డి గారి మరణం మాకు ఎప్పటికీ తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ సత్తి వెంకటరెడ్డి గారు (కోళ్లఫ్లారం)
మరణం: 8-10-2024
ఆరవల్లి, అత్తిలి మండలం

భార్య: శ్రీమతి సత్తి నాగరత్నం (లేటు)
కుమారులు: సత్తి వీర్రెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి - (మణికంఠ రెడ్డి)
కోడళ్ళు: రాధారాణి, గోపాలకుమారి
కుమార్తె: కొవ్వూరి అమరావతి అల్లుడు: వెంకటరామారెడ్డి
మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, కుటుంబసభ్యులు మరియు బంధుమిత్రులు

పెద్దకార్యం: ది. 20-10-2024 ఆదివారం ఆరవల్లి గ్రామంలో మా స్వగృహమునందు జరుగును. కావున తెలియపర్చడమైనది

చర్చి నిర్మాణానికి విరాళం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: వైకాపా రాష్ట్ర రైతు విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డీ రఘురాం నాయుడు తాడేపల్లిగూడెం మండలం వెంకట్రావుపాలెం గ్రామంలో ఆదివారం పర్యటించారు. కార్యకర్తలు, నాయకులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చర్చి నిర్మాణానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు.

సర్పంచికి పరామర్శ

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పెద తాడేపల్లి సర్పంచి పోతుల అన్నవరం మాతృమూర్తి వెంకాయమ్మ ఇటీవల మృతి చెందారు. ఆయనను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. వెంకాయమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


రమేశ్ (పాత చిత్రం)

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెం మండలం ముత్యాలంబాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు...గ్రామానికి చెందిన అన్నవేడి రమేశ్ (32) ముత్యాలమ్మ ఆలయం వెనుక రోడ్డులో పాన్‌షాపు నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో గ్రామోత్సవంలో భాగంగా ఉదయం అమ్మవారిని తడి దుస్తులతో వాహనంపైకి ఎక్కించారు. అనంతరం పాన్‌షాపు వద్దకెళ్లి రిఫ్రిజిరేటర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. అతడి తండ్రి శ్రీనివాస్ గతంలో ముత్యాలమ్మ ఆలయ కమిటి అధ్యక్షుడిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఎన్‌డీయే నాయకుడిగా కొనసాగుతున్నారు. మృతుడికి తల్లి మాధవి, భార్య వెంకటలక్ష్మి, కుమార్తె మోక్షిత, కుమారుడు యువన్ శ్రీ ఉన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మృతుడి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు.

పట్టింపులేని పారిశుద్ధ్యం



అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి మండలం పాలూరులోని కొత్త కాలనీలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్తా చెదారం నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో దోమలు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.

పట్టాలెక్కనున్న పల్లె ప్రగతి..!

నేటి నుంచి 'గ్రామదర్శిని'

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: చెడుపై మంచి సాధించిన విజయానికి సూచిక విజయదశమి. అయిదేళ్ల వైకాపా పాలనలో పల్లెల్లో సమస్యలు మేట వేశాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కారు పల్లె ప్రగతిపై దృష్టి సారించింది. తణుకు నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ , గోకులం షెడ్ల నిర్మాణ పనులు పట్టాలెక్కనున్నాయి. దీని కోసం ఇటీవల గ్రామసభలు నిర్వహించి పనులు గుర్తించింది. 14 నుంచి 20 వరకు 'పల్లె పండుగ' పేరుతో గ్రామదర్శిని ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అత్తిలి మండలం కె సముద్రపుగట్టు నుంచి గ్రామదర్శిని ప్రారంభించనున్నారు.


ఇల్లిందలపర్రు: రహదారి దుస్థితి

మండలం	మంజూరైన పనులు	నిధులు రూ.కోట్లలో
తణుకు	24	2.376
ఇరగవరం	25	1.717
అత్తిలి	32	2.907

గోకులాల షెడ్లు

మండలం	మంజూరు	నిధులు
తణుకు	56	రూ.82.62 లక్షలు
ఇరగవరం	43	రూ.92 లక్షలు
అత్తిలి	44	రూ.1.22కోట్లు

వెంకటేశ్వరరావు విగ్రహ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జగ్గన్నపేటలో పత్స వెంకటేశ్వరరావు విగ్రహ ఆవిష్కరణ ఆదివారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన పెద్ద కుమారుడు పత్స వినాయక స్వామి మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వెంకటేశ్వరరావు 1981 వరకు రెండున్న దశాబ్దాల పాటు క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారన్నారు. నల్లజర్ల సమితి ఉపాధ్యక్షుడిగానే కాకుండా, సర్పంచిగా సేవలందించారని తెలిపారు. వెంకట సీతారామ ప్రకాశ్, వీర వెంకట నాగరాజు, పలివెల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





రహదారిపై ఇసుక

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి నుంచి పిప్పర వెళ్లే ప్రధాన రహదారిలో రామన్నపేట ఆంజనేయస్వామి విగ్రహం ఎదురుగా ప్రధాన రహదారిపైనే భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రదేశంలో పనులు చేపడుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇటీవల ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురు ఆసుపత్రి పాలయ్యారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | తణుకు బ్రాంచ్ (0925) యర్రమిల్లి వారి వీధి, మెయిన్ రోడ్, తణుకు

ఇ-వేలం ద్వారా వాహనములు అమ్మకం

ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారుడు మా బ్యాంక్ నుండి వాహనములు కొనుగోలు నిమిత్తం లోను సౌకర్యంను పొంది వున్నారు. బ్యాంకునకు చెల్లించవలసిన వాయిదాలను సక్రముగా చెల్లించనందున బ్యాంకు వారు వాహనములను స్వాధీనము చేసుకొని "యధాతధ స్థితిలో" ఈ వేలం ద్వారా తేది.30.10.2024న అమ్ముటకు నిర్ణయించినారు. వాహనముల లోను తాలూకా అసలు బకాయి సొమ్ము మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనుటకై ఈ క్రింది తెలిపిన వాహనములను ఇ-వేలమునకు బిడ్స్ ఆహ్వానించడమైనది.

వ. నెం.	ఖాతా నెం. & ఋణగ్రహీత పేరు	వాహనములు & మోడల్	వాహనముల నెం. & కలర్	రిజర్వు ధర & ధరావత్తు
1	ఖాతా నెం.41601328999 శ్రీమతి మండ్రు కుసుమ తండ్రి: జార్జ్	EICHER BUS 6016N CWC (Diesel) Model: 12/2022	AP 39 UM 0174 Colour: White & Green	రూ.18,00,000/- రూ.1,80,000/- (Including GST)
		EICHER BUS 6016N CWC (Diesel) Model: 12/2022	AP 39 UM 0175 Colour: White & Green	రూ.18,00,000/- రూ.1,80,000/- (Including GST)

ఇ-వేలం తేది మరియు సమయం : ది.30-10-2024,ఉ॥ గం॥ 11.00 నుండి 12.00 గం॥ల వరకు (అపరిమిత పొడిగింపు)
వాహనముల తనిఖీ కొరకు బ్యాంక్ పని దినములలో సంప్రదించగలరు.
బిడ్స్ సమర్పించు కొనుటకు ఆఖరు తేది మరియు సమయం ది.29-10-2024న మ॥ 1.00 గం॥లలోపు. ఆ తరువాత వచ్చిన బిడ్స్ అంగీకరించబడవు.
కనీస బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-.
SBI, తణుకు బ్రాంచ్, తణుకు
ఇ.యం.డి అమౌంట్ డిపాజిట్ చేయుటకు ఖాతా నెం. 37608382215 (IFSC:SBIN0000925).
ధరావత్తు సొమ్మును RTGS / NEFT ద్వారా చెల్లించిన పాటదారులు సాంకేతిక సమస్యలు తలెత్తినచో బ్యాంకు వారు బాధ్యత వహించరు.

నియమ నిబంధనలు : (1) రిజర్వ్ ధర కన్నా తక్కువ ధరకు వాహనములు అమ్మబడవు. (2) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకం ధరలో కనీసం 25% (10+15%) తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్ము 7 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసులు లేకుండా అప్పటి వరకు చెల్లించిన సొమ్మును కోల్పోవుదురు. (3) వేలం వాయిదా వేయుటకు, రద్దుపరుచుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. (4) వాహనములను బ్యాంక్ పనిదినములలో తనిఖీ చేసుకోగలరు. వాహనముల తనిఖీ కొరకు సంప్రదించవలసిన వారు, అధీకృత అధికారి, మొబైల్ నెం.96521 66986 మరియు రికవరీ ఏజెంట్, మెస్సర్స్ సూర్యాంశ్ అసోసియేట్స్, మొబైల్ నెం.93939 44595 (5) వాహనములు రిజిస్ట్రేషన్ (FRC) బాధ్యత విజయవంతమైన బిడ్డర్‌ది మాత్రమే మరియు రిజిస్ట్రేషన్ పేరు మారిన తరువాత మాత్రమే వాహనములు ఇవ్వబడును. (6) మరిన్ని వివరాలకొరకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తణుకు బ్రాంచ్, తణుకు వారిని సంప్రదించగలరు. (7) ఇ-వేలం కొరకు వెబ్ పోర్టల్ https://www. bankeauctions.com, M/s C1 India Pvt Ltd, శ్రీ ధరణీకృష్ణ, సెల్: 9948182222. నందు సంప్రదించగలరు.
గమనిక : గ్యారేజ్ అద్దెను మరియు ఇతర ఖర్చులను విజయవంతమైన బిడ్డరు చెల్లించవలెను.

తేది : 14.10.2024
ప్రదేశం : తణుకు
సం/- అసిస్టెంట్ జనరల్ మేనేజర్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తణుకు బ్రాంచ్

(c) eenadu